# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శుక్రవారం 13 జూన్ 2025 | సంపుటి:9 | సంచిక:167 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM








# 290 మంది దుర్మరణం..?



## గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో విమానం కుప్పకూలిన దుర్ఘటనలో 242 మంది ప్రయాణీకులు, 12 మంది సిబ్బంది మృతి!

### బీజేపీ నాయకుడు, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా..

### మృతుల్లో 169 మంది భారతీయులు కాగా, మిగిలిన వారు విదేశీయులు

- బీజే హాస్టల్‌లోని 15 మంది డాక్టర్లు మృత్యువాత
- 1996 చర్ఖీ దాద్రీ వద్ద 349 మందిని బలిగొన్న వైమానిక దుర్ఘటన తరువాత దేశంలో ఇదే అతి పెద్ద విమాన ప్రమాదం
- ప్రమాదం వెనుక ఖలిస్థానీ తీవ్రవాదులుండొచ్చని అనుమానాలు
- ఒక ప్రయాణీకుడు హెచ్చరించినప్పటికీ ఎయిరిండియా పట్టించుకోలేదని సోషల్ మీడియాలో వైరల్
- ఎప్పటిలాగే స్పందించిన టాటా గ్రూపు.. భారీ సాయం
- రాష్ట్రపతి, ప్రధానితో సహా వివిధ దేశాధినేతల సంతాపాలు

అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 288 మంది దుర్మరణం పాలవడం దేశాన్ని విషాదంలో ముంచింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్ వెళ్లే ఎయిరిండియా విమానం గురువారం మధ్యాహ్నం 1.39 సమయంలో టేకాఫ్ అయిన క్షణాల్లోనే సమీపంలోని ఒక మెడికల్ కాలేజీ బిల్డింగ్‌పై కుప్పకూలి.. ఆ వెంటనే పేలింది. పేలుడు మంటలు ఉవ్వెత్తున మంటలు ఎగిసిపడ్డాయి. విమానంలో 242 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది ఉన్నారు. అధికారికంగా మృతుల సంఖ్యను ప్రకటించకపోయినప్పటికీ ఒక్క ప్రయాణికుడు తప్ప దాదాపు అందరూ మరణించినట్టు సమాచారం. మృతుల్లో బీజేపీ నేత, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఉన్నారు. విమానంలోని వారే కాకుండా హాస్టల్‌లోని 15 మందికి పైగా డాక్టర్లు కూడా దుర్ఘటనకు బలయ్యారు. రాష్ట్రపతి, ప్రధానితో పాటు వివిధ దేశాధినేతలు సంతాపం ప్రకటించారు. కాగా, దేశీయ వ్యాపార సంస్థ అయిన టాటా గ్రూపు మృతులు ఒక్కొక్కరి కుటుంబానికి కోటి రూపాయిల చొప్పన ఇస్తానంటూ ప్రకటించింది. విమానం కూలడం వల్ల దెబ్బతిన్న మెడికల్ కాలేజీ భవనాన్ని కూడా నిర్మించి ఇస్తానన్నది. ప్రమాదానికి కారణాలు వెతికే పని యథాప్రకారమే మొదలైంది. దీనిపై పక్షులు ఢీకొన్నాయా? లేక ఉగ్రసంస్థలున్నాయా? అనే కోణంలో దర్యాప్తు మొదలైంది.

మొత్తం ప్రమాద ఘటనలో ఒక్క ప్రయాణీకుడు మాత్రం మృత్యుంజయుడుగా బయట పడడం ఒకింత ఊరట కలిగిస్తున్న విషయం. కాగా, ఈ ప్రమాదం జరగొచ్చని తాను ముందే హెచ్చరించానని, కానీ ఎయిరిండియా పట్టించుకోలేదని ఒక ప్రయాణీకుడు చెబుతున్నాడు. ఈ ఘటన మన వ్యవస్థల్లోని.. అందునా, ప్రజల ప్రాణాలతో కూడుకున్న వ్యవస్థల్లోని లోపాలను ఎత్తి చూపుతుంది. అయినా, దీని గురించి పెద్దగా పట్టించుకోకపోవచ్చు. ఒకట్రెండు రోజుల ప్రకటనలు, ఖండనమండనలు, చర్చలు.. ఆ తరువాత అంతా రోటీన్ అయిపోతుంది. యథా ప్రజా.. తథా పాలక ..

### మాటలకందని విషాదం



''అహ్మదాబాద్లో జరిగిన విమాన ప్రమాదం గురించి తెలిసి తీవ్రంగా కలత చెందాను. ఇది హృదయ విదారకర ఘటన. దీనిపై మాటలు రావట్లేదు. ఈ క్లిష్ట సమయంలో దేశం బాధితులకు తోడుగా నిలుస్తుంది''

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

### తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది



''అహ్మదాబాద్లో చోటుచేసుకున్న ఈ విషాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ హృదయ విదారక ఘటన మాటలకందని విషాదం. ఈ విపత్కర సమయంలో బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. సహాయక చర్యలపై మంత్రులు, సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నా''

- ప్రధాని నరేంద్ర మోడీ

### హృదయం ముక్కలైంది



''విమాన ప్రమాదం వార్త వినగానే హృదయం ముక్కలైంది. బాధిత కుటుంబాల ఆవేదన వర్ణణాతీతం. ఈ క్లిష్ట సమయంలో ప్రతి క్షణం, ప్రతి క్షణం విలువైనదే. సహాయకచర్యలు వేగంగా జరగాలి. క్షేత్రస్థాయిలో ఎలాంటి సాయం చేయడానికైనా కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండాలి''

- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ

### దిగ్భ్రాంతికి గురిచేసింది



''అహ్మదాబాద్ విమాన ప్రమాదం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రార్థిస్తున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు 'ఎక్స్'లో పేర్కొన్నారు''

- ఏపీ సీఎంచంద్రబాబు

### సహాయక చర్యలు వేగవంతం చేయాలి



''అహ్మదాబాద్ నుంచి లండన్కు బయలుదేరిన విమానం ప్రమాదానికి గురవడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. విమానంలో ఉన్న ప్రయాణికులు, సిబ్బంది క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. క్షతగాత్రులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సహాయక చర్యలు వేగవంతం చేయాలని కోరారు''

- సీఎం రేవంత్ రెడ్డి

### హెల్ప్ లైన్ నెంబర్ 1800 5691 444

Help Line

ప్రయాణీకుల సమాచారం కోసం 1800 5691 444 అనే ప్రత్యేక హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేశారు. ప్రమాదానికి సంబంధించిన ఎటువంటి సమాచారానికైనా ఈ హెల్ప్ లైన్ నెంబర్ కు ఫోన్ చేయవచ్చని ఎయిరిండియా ప్రకటించింది.

### 'ఎక్స్'లో నలుపు రంగు డీపీతో.. ఎయిరిండియా సంతాపం

విమాన ప్రమాదంపై ఎయిరిండియా సంస్థ 'ఎక్స్'లో అధికారిక ఖాతాలో డీపీ మార్చింది. బాధితులకు సంతాపం తెలుపుతూ నలుపు రంగు డీపీ పెట్టింది.

### రూ. కోటి ప్రకటించిన టాటా

**క్షతగాత్రులకు పూర్తి చికిత్సలు కూడా అందిస్తమని ప్రకటన**

**బీజీ కాలేజీకి కొత్త భవనం కట్టిస్తం**

ముంబై, జూన్ 12ః ఆపత్కాలంలో ఆదుకునేందుకు ఎల్లప్పుడూ ముందుండే దేశీయ వ్యాపార సంస్థ టాటా గ్రూప్ అనేది అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ విమాన ప్రమాదంపై ఆ సంస్థ ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా ...మిగతా 2లో

## ప్రపంచ దేశాధినేతల సంతాపం

**హృదయవిదారకం:** బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ లండన్ గాట్విక్కు బయల్దేరిన విమానం ప్రమాదానికి గురైన ఘటనపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయని విచారం చెందారు. పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు.

### హృదయ విదారకం

గుజరాత్లోని అహ్మదాబాద్ సమీపంలో జరిగిన విమాన ప్రమాదం ఘటన హృదయవిదారకం. ఈ బాధిత కుటుంబాలు కోలుకోవాలని ఆశిస్తున్నా.

- యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా

### ఎంతగానో బాధించింది

భారత్లో జరిగిన విమాన ప్రమాదం మమ్మల్ని ఎంతో బాధించింది. బాధితులు త్వరగా కోలుకోవాలి.

- భారత్లోని కెనడా హైకమిషన్

### బాధాకరం

విమానం ప్రమాదం బాధాకరం. ఈ ప్రమాదంలో యూకే, కెనడా, పోర్చుగల్ ఇలా ఇతర దేశ ప్రయాణికులు కూడా ఉన్నారు. వీరంతా ప్రమాదానికి గురి అయినందుకు చింతిస్తున్నాను. వీలైనంత ఎక్కువ మంది ప్రాణాలతో బయటపడాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను.

- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ

### విచారం వ్యక్తం చేస్తున్న

అహ్మదాబాద్ సమీపంలో ఎయిరిండియా విమానానికి జరిగిన ప్రమాదంపై విచారం వ్యక్తం చేస్తున్నాము.

- మాల్దీవులు అధ్యక్షుడు ముయిజ్జు

## రైతులకు కేంద్రం శుభవార్త..



**అమరావతి:** రాష్ట్ర రైతులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. కందిపప్పు సేకరణ గడువును పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు. కందిపప్పు సేకరణను మరో 15 రోజులకు పొడిగింపుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలుపుతూ.. ఈ నిర్ణయంలో త్వరితగతిన సహకరించి రైతులకు ఎంతో ఉపయోగపడేలా చర్యలు తీసుకున్నందుకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కేంద్రమంత్రి రామ్మోహన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**కేంద్రమంత్రి ట్వీట్ ఇదే..**

'ఆంధ్రప్రదేశ్ రైతులకు శుభవార్త. కందిపప్పు సేకరణ గడువుపై మన ...మిగతా 2లో



## 'తల్లికి వందనం'.. 67 లక్షల మందికి

# రూ.10,091కోట్లు

### సీఎం చంద్రబాబు

**అమరావతి:** ఎన్డీయే కూటమికి అభివద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. కూటమి పాలనకు నేటితో ఏడాది పూర్తయిన సందర్భంగా ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేశ్‌తో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ 'తల్లికి వందనం' అమలు చేస్తున్నామని చెప్పారు. ''సంపద సష్టిస్తాం.. ఆదాయాన్ని పెంచుతామని ముందే చెప్పాం. పెంచిన ఆదాయాన్ని అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నాం. 'తల్లికి వందనం' పథకం 67 లక్షల మంది ...మిగతా 2లో

## కాలం బాగోలేదు, అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలి

### మహిళ కమిషన్ చైర్ పర్సన్ కీలక వ్యాఖ్యలు..!

**అమరావతి:** అనంతపురం జిల్లా రామగిరిలో మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి కేసు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ కేసు తీవ్రతను దష్టిలో ఉంచుకుని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఘటనా ప్రాంతాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా ఓ మైనర్ బాలికపై లైంగిక దాడులు జరుగుతున్నాయని విచారకరమైన విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ''కాలం బాగోలేదు%ౌ% అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలి. ఏవైనా అనుమానాలు ఉంటే తల్లిదండ్రులకు చెప్పాలి'' అంటూ ఆమె సూచనలు చేశారు. అయితే, తన ప్రసంగంలో మైనర్ బాలిక



పేరు బయట పెట్టిన శైలజ, అది పొరపాటుగా జరిగిందని ...మిగతా 2లో

## తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభమైన పాఠశాలలు.. విద్యార్థుల సందడి

తెలుగు రాష్ట్రాల్లో పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. వేసవి సెలవుల అనంతరం నేటి నుంచి తెరుచుకున్నాయి. చిన్నారుల రాకతో ఏపీ, తెలంగాణల్లోని విద్యాసంస్థల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఏపీ ప్రభుత్వం నేటి నుంచే 'తల్లికి వందనం' నిధులను జమచేయనుంది. తొలిరోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేయనున్నారు.

# కూలిన ఎయిరిండియా విమానం



అహ్మదాబాద్, జూన్ 12: గుజరాత్ అహ్మదాబాద్లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి గురువారం మధ్యాహ్నం 1.39 సమయంలో లండన్ బయల్దేరిన ఎయిరిండియా ఫ్లయిట్ నెంబర్ ఏఐ-171 విమానం కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో దానిలో 242 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది ఉన్నారు. ఒక్క ప్రయాణికుడు తప్ప దాదాపు అందరూ మరణించినట్టు సమాచారం. రన్వే నుంచి టేకాఫ్ అయిన 30 సెకన్లలోనే ఎయిర్పోర్ట్ సమీపంలోని మేఘాని నగర్ ఘోడాసర్ క్యాంప్ ప్రాంతంలోని మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంపై ఒక్కసారిగా కూలిపోయింది. పేలుడు కారణంగా ఉవ్వెత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఆ ప్రదేశం నుంచి దట్టమైన నల్లటిపొగ అన్ని వైపులకు వ్యాపించింది. ఫ్లైట్ రాడార్ 24 ప్రకారం విమానం 625 అడుగుల ఎత్తులో ఉండగా సిగ్నల్స్ కోల్పోయింది. ఈ క్రమంలో పూర్తిగా కిందకు దిగిపోయి చెట్టును ఢీకొన్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు.

విమాన ప్రయాణీకుల్లో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కూడా ఆ విమానంలో ఉన్నట్లు ఏబీపీ పత్రిక పేర్కొంది.

డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియిషన్ (డీజీసీఏ) వెల్లడించిన వివరాల ప్రకారం.. విమానానికి కెప్టెన్ గా సుమిత్ సబర్వాల్, ఫస్ట్ ఆఫీసర్గా క్లైవ్ కుందర్ లున్నారు. సుమిత్కు ఎల్టీసీగా 8,200 గంటలు, కోపైలట్ కు 1,100 గంటల అనుభవం ఉన్నట్లు వెల్లడించింది. ఏటీసీ నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ విమానం రన్వే 23 నుంచి గాల్లోకి ఎగిరినట్లు తెలిపింది. కొద్ది సేపటికే ఆ ఎయిర్ క్రాఫ్ట్ నుంచి ఏటీసీకి మేడేకాల్ (అత్యవసర కాల్) వచ్చిందని వెల్లడించింది. ఆ తర్వాత కూలిపోయినట్లు పేర్కొంది. విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులతో పాటు ఒక కెనడా వాసి ఉన్నట్లు వెల్లడించింది. ఈ ప్రమాదంపై సమాచారం కోసం హాట్లైన్ నెంబర్ 1800 5691 444 ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఎయిర్ఇండియా వెబ్ సైట్లో కూడా ప్రమాద వివరాలు, అప్డేట్లు ఉంటాయని పేర్కొంది. ప్రమాదం జరిగిన వెంటనే తదుపరి ప్రకటన వెలువడే వరకు అహ్మదాబాద్ ఎయిర్పోర్టులో ఫ్లైట్ ఆపరేషన్స్ అన్నిటినీ సస్పెండ్ చేశారు.

# అతిపెద్ద విమాన ప్రమాదాలు

హైదరాబాద్, జూన్ 12: ఇప్పటి వరకూ భారత దేశంలో జరిగిన అతి పెద్ద విమాన ప్రమాదాలు..

### ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్

7 ఆగస్టు, 2020: కాలికట్ అంతర్జాతీయ విమానాశ్రయం ల్యాండింగ్ సమయంలో ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ విమానం రన్వేను దాటి వెళ్లింది. ఈ ప్రమాదంలో 18 మంది మరణించగా, 172 మంది సజీవంగా బయటపడ్డారు. ఈ ఘటన కేరళలోని కోజికోడ్లో జరిగింది. ఇది ఇటీవలి సంవత్సరాలలో జరిగిన ముఖ్యమైన ప్రమాదాలలో ఒకటిగా నిలిచింది.

### దుబాయ్-మంగళూరు ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్

22 మే, 2010: మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో కూడా ల్యాండింగ్ సమయంలో ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ విమానం రన్వేను దాటి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 158 మంది మరణించారు. కేవలం 8 మంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు.

### అలయన్స్ ఎయిర్ ఫ్లైట్ 7412

17 జూలై, 2000: పాట్నాలోని ఒక రెసిడెన్షియల్ ఏరియాలో అలయన్స్ ఎయిర్ ఫ్లైట్ 7412 అనుకోకుండా కూలిపోయింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న 55 మందితో పాటు భూమిపై ఉన్న ఐదుగురు మరణించారు. ఈ ఘటన బీహార్లో జరిగిన తీవ్రమైన విమాన ప్రమాదాలలో ఒకటి.

### చర్ఖీ దాద్రీ మిడ్-ఎయిర్ ఘర్షణ

12 నవంబర్, 1996: సౌదీ అరేబియన్ ఎయిర్లైన్స్, కజకిస్తాన్ ఎయిర్లైన్స్ విమానాలు చర్ఖీ దాద్రీ వద్ద గాలిలో ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు విమానాలలోని 349 మంది ప్రయాణికులు మరణించారు. ఇది భారతదేశంలో జరిగిన అత్యంత ఘోరమైన విమాన ప్రమాదాలలో ఒకటిగా గుర్తించబడింది.

### ఔరంగాబాద్ ఇండియన్ ఎయిర్ లైన్స్

26 ఏప్రిల్, 1993: ఔరంగాబాద్లో టేకాఫ్ సమయంలో ఇండియన్ ఎయిర్లైన్స్ విమానం ఒక ట్రక్కును ఢీకొంది. ఈ ప్రమాదంలో 55 మంది మరణించగా, 66 మంది గాయపడ్డారు. మహారాష్ట్రలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర ప్రభావం చూపింది.

### ఇండియన్ ఎయిర్ లైన్స్ ఇంఫాల్

16 ఆగస్టు, 1991: ఇంఫాల్కు దిగుతున్న సమయంలో ఇండియన్ ఎయిర్లైన్స్ విమానం కూలిపోయింది. ఈ ప్రమాదంలో 69 మంది మరణించారు. మణిపూర్లో జరిగిన ఈ ఘటన ఆ రాష్ట్రంలోని విమాన భద్రతపై చర్చలను రేకెత్తించింది.

### ఇండియన్ ఎయిర్ లైన్స్ బెంగళూరు

14 ఫిబ్రవరి, 1990: బెంగళూరు విమానాశ్రయంలో కూడా ఇండియన్ ఎయిర్లైన్స్ విమానం ఇది వరకు కుప్పకూలింది. ఈ ఘటనలో 92 మంది మరణించారు. కర్ణాటకలో జరిగిన ఈ ప్రమాదం ఆ రోజుల్లో విమాన భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలను లేవనెత్తింది.

### ఇండియన్ ఎయిర్ లైన్స్ అహ్మదాబాద్

19 అక్టోబర్, 1988: అహ్మదాబాద్ విమానాశ్రయంలో ల్యాండింగ్ సమయంలో ఇండియన్ ఎయిర్లైన్స్ విమానం కూలిపోయింది. ఈ ప్రమాదంలో 133 మంది మరణించారు. గుజరాత్లో జరిగిన ఈ ఘటన సంచలనంగా మారింది.

### ఎయిర్ ఇండియా బొంబాయి

21 జూన్, 1982: వాతావరణంలో మార్పు కారణంగా బొంబాయిలో ఎయిర్ ఇండియా విమానం కూలిపోయింది. ఈ ఘటనలో 17 మంది మరణించగా, 94 మంది సజీవంగా బయటపడ్డారు. మహారాష్ట్రలో జరిగిన ఈ ప్రమాదం వాతావరణ సవాళ్లను ఎదుర్కొనే విమాన భద్రతా వ్యవస్థలపై దృష్టిని సారించింది.

### ఎయిర్ ఇండియా బాంద్రా

1 జనవరి, 1978: బాంద్రా తీరంలో ఎయిర్ ఇండియా విమానం కూలిపోయింది. ఈ ఘటనలో 213 మంది మరణించారు. ఈ ప్రమాదం భారతదేశంలో జరిగిన అత్యంత ఘోరమైన విమాన ప్రమాదాలలో ఒకటిగా నిలిచింది.

# బోయింగ్ లోనే సమస్య?

విమాన ప్రమాద ఘటన నేపథ్యంలో బోయింగ్ విమానాల భద్రత అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ సంస్థ రూపొందించిన ఈ డ్రీమ్ లైనర్ విమానం గురించి ఆరా తీస్తున్నారు. దీనిలో ఇప్పటికే పలుమార్లు సాంకేతిక సమస్యలు తలెత్తినా.. విమానం కుప్పకూలడం మాత్రం ఇదే తొలిసారి.

**నాన్ స్టాప్గా**

**13వేల కిలోమీటర్లు ఎగిరింది..**

అమెరికాకు చెందిన విమాన నిర్మాణ సంస్థ బోయింగ్ రూపొందించిన వైడ్ బాడీ మోడల్స్లో 787-8 డ్రీమ్లైనర్ ఒకటి. ఇందులో ఒకేసారి 242-290 మంది వరకు ప్రయాణించొచ్చు. 2011లో బోయింగ్ దీన్ని విపణిలోకి తెచ్చింది. ఎయిర్లైన్ సంస్థలు ఖండాంతర ప్రయాణాలకు ఈ మధ్యస్థ పరిమాణం కలిగిన విమానాలను వినియోగిస్తుంటాయి. ఈ ఎయిర్ క్రాఫ్ట్ నాన్స్టాప్గా 13,530 కిలోమీటర్లు ప్రయాణించగలదు. ప్రధాన నగరాల మధ్య నాన్-స్టాప్ ప్రయాణాలకు ఈ మోడల్ను ఎక్కువగా వినియోగిస్తుంటారు. విమాన బాడీ 50% కంటే ఎక్కువ కార్బన్ ఫైబర్ సమ్మేళనాలతో నిర్మితమైంది. ఇది స్టీల్ కంటే బలంగా ఉంటుంది. అల్యూమినియం కంటే తేలికైనది. దీంతో ఇంధనాన్ని సమర్థంగా వినియోగించుకొంటుంది. పర్యావరణహితమైనదిగా దీనికి పేరుంది.

**సాంకేతిక సమస్యలు..**

బోయింగ్ 787-8 డ్రీమ్లైనర్ విమానం హైడ్రాలిక్ లీక్ సమస్యలు, బ్యాటరీ సమస్యలతో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయిన సందర్భాలు ఉన్నాయి. బోయింగ్ ఇంజినీర్, విజిల్ బ్లోయర్ సామ్ సలేపూర్ న్యూయార్క్ టైమ్స్, సీఎన్ఎన్ వంటి మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో గతంలో దీనిపై ఆరోపణలు చేశారు. బోయింగ్ 777, 787 డ్రీమ్లైనర్ మోడళ్ల నిర్మాణంలో నాణ్యత లోపించిందని ఆరోపించారు. దీనివల్ల దీర్ఘకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఈ విమానాల తయారీని పూర్తిగా నిలిపేయాలని డిమాండ్ చేశాడు. తమపై వచ్చిన ఆరోపణలను బోయింగ్ కొట్టిపారేసింది. తాజా ఘటనపై లోతైన దర్యాప్తు జరిగాక ఈ ఆరోపణలకు సంబంధం ఉందా లేదా అనేది తేలుతుంది. మరోవైపు ఈ ప్రమాద ఘటన నేపథ్యంలో బోయింగ్ షేర్లు పతనం అయ్యాయి.



# బీజే మెడికల్ కాలేజీ హాస్టల్పై పడిన లోహ విహంగం

అహ్మదాబాద్లో ప్రమాదానికి గురైన ఎయిర్ ఇండియా విమానం ఫ్లయిట్ నెంబర్ ఏఐ-171 జనావాసాల్లో పడింది. దీనిలోని కొన్ని భాగాలు అక్కడే ఉన్న బీజే మెడికల్ కాలేజీ యూజీ హాస్టల్ భవనాలపై పడ్డాయి. దీంతో భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో 15 మంది మెడికల్ విద్యార్థులు చనిపోయారు. కనీసం పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన నిమిషాల్లో సహాయక సిబ్బంది అక్కడికి చేరుకోవడంతో పలువురిని సురక్షితంగా బయటకు తీశారు. విద్యార్థుల భోజనాలు చేస్తున్నప్పుడు ఈ ఘటన చోటు చేసుకోవడంతో మెస్లో ప్లేట్లు, ఆహారం చిందరవందరగా పడిన దృశ్యాలు వైరల్గా మరాయి. సహాయక చర్యలు చేపట్టారు.

## ప్రధాని మోడీ ఆరా..

### అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశం

గుజరాత్ విమాన ప్రమాదంపై ప్రధాని మోడీ యాక్షన్లోకి దిగారు. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఫోన్లో మాట్లాడారు. ప్రమాద ఘటనపై ఆరా తీశారు. ఘటనాస్థలి వద్ద సహాయక చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాదు ఎప్పటికప్పుడు వివరాలను తనకు అప్డేట్ చేయాలని కేంద్రమంత్రులను ప్రధాని ఆదేశించారు.

## బోయింగ్ కూలడం ఇదే మొదటి సారి..

బోయింగ్ విమాన కంపెనీకి చెందిన 787 డ్రీమ్ లైనర్ కూలడం ఇదే మొదటిసారి అని విమానయాన నిపుణులు చెబుతున్నారు. ఎయిర్ ఇండియా నడిపిస్తున్న డ్రీమ్ లైనర్ విమాన మోడల్ ను 2011లో ప్రవేశపెట్టారు. 14 ఏండ్ల క్రితం వచ్చిన ఆ విమానాన్ని డ్రీమ్ లైనర్ మోడల్ గా కూడా పిలుస్తారు. అమెరికా కంపెనీ డ్రీమ్ లైనర్ విషయంలో ఇటీవల ఓ వేడుక కూడా నిర్వహించింది. డ్రీమ్లైనర్లో ప్రపంచవ్యాప్తంగా సుమారు వంద కోట్ల మంది ప్రయాణికులు ట్రావెల్ చేశారని మైలురాయి సంబరాలు కూడా జరుపుకున్నారు.

# 288 మంది మృతి



అహ్మదాబాద్లో ప్రమాదానికి గురైన విమానంలో మొత్తం 242 మంది ప్రయాణీకులున్నారు. వీరిలో 169 మంది భారతీయులు కాగా, కాగా, 53 మంది బ్రిటన్ పౌరులు, ఏడుగురు పోర్చుగల్, ఒకరు కెనడాకు చెందిన వారున్నారు. వీరితో పాటు ఇద్దరు పైలట్లు, 10 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో ఒక్క ప్రయాణీకుడు తప్ప దాదాపు అందరూ మృతి చెందారు. మరోవైపు విమానం కుప్పకూలిన బీజే మెడికల్ కళాశాల హాస్టల్లో ఉన్న విద్యార్థుల్లో కొందరు మృతి చెందినట్లు తెలుస్తోంది.

# పక్షులు ఢీకొట్టాయా?

విమాన ప్రమాదాలకు సాంకేతిక వైఫల్యాలు ఓ కారణమైతే పక్షులు కూడా కొన్ని సందర్భాల్లో ప్రమాదకరంగా మారుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్న విషయం తెలిసిందే. అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొన్ని క్షణాలకే ఘోర ప్రమాదానికి గురయ్యింది. దీనికి స్పష్టమైన కారణం తెలియనప్పటికీ.. పక్షులు ఢీకొట్టడం వల్ల విమానం నిర్దిష్ట వేగాన్ని అందుకోలేకపోయి ఉండవచ్చని నిపుణులు అనుమానిస్తున్నారు. దీని వల్ల ప్రమాదం సంభవించే అవకాశాలను తోసిపుచ్చలేమని చెబుతున్నారు.సీనియర్ పైలట్ సౌరభ్ భట్నాగర్ ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. ''ఘటనను బట్టి చూస్తే అనేక పక్షులు ఢీకొట్టడంతో విమానం రెండు ఇంజిన్లు శక్తికి కోల్పోయి ఉండొచ్చని ప్రాథమికంగా కనిపిస్తోంది. టేకాఫ్ సరిగా కాలేదు. పైకి వెళ్లాల్సిన విమానం ఒక్కసారిగా కిందకు దిగినట్లు ఫుటేజీలో కనిపించింది. పైలట్ వెంటనే మేడే కాల్ ఇచ్చారు. ఇంజిన్ శక్తి కోల్పోవడం లేదా విమానం పైకి ఎగరలేకపోయిన సందర్భంలోనే ఇలా జరుగుతుంది. ఏదేమైనా కచ్చితమైన కారణం మాత్రం దర్యాప్తులోనే తేలుతుంది'' అని పేర్కొన్నారు.

అంతర్జాతీయ పౌరవిమానయాన సంస్థ ప్రకారం విమానాలను పక్షి ఢీకొట్టే ఘటనల్లో 92శాతం అంతగా ప్రమాదం లేదని లేనప్పటికీ.. మిగతా 8శాతం మాత్రం తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నట్లు అంచనా. ముఖ్యంగా ఇంజిన్లోకి పక్షులు కూరుకుపోయిన సందర్భాల్లో పరిస్థితులు అత్యంత భయంకరంగా ఉంటున్నాయి. మరికొన్ని పరిస్థితుల్లో పక్షులు లేదా రాబందుల వల్ల విమానాలు అత్యవసర ల్యాండింగ్లకు దారితీస్తున్నాయి.

**625 అడుగుల ఎత్తు వరకే..**

ఫ్లైట్రాడార్24 డేటా ప్రకారం.. ప్రమాదానికి ముందు విమానం కేవలం 625 అడుగుల ఎత్తువరకే వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే, సుదూర ప్రయాణానికి వెళ్లే ఆ విమానంలో ఇంధనం కూడా భారీగానే ఉంటుంది. ప్రమాదానికి ముందు విమాన దృశ్యాలను చూస్తుంటే.. ఎత్తుకు వెళ్లేందుకు బదులుగా విమానం వేగంగా నేల వైపు దూసుకెళ్లింది. ఇలా భారీ పరిమాణం, బరువు ఉన్న విమానం ఆ ఎత్తులో సిగ్నల్ కోల్పోవడం అత్యంత ప్రమాదకరమేనని నిపుణులు చెబుతున్నారు.

# రూ. కోటి ప్రకటించిన టాటా

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా ప్రశంసలు కురిపిస్తోంది. అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నట్లు టాటా గ్రూప్ ప్రకటించింది. ఈ మేరకు టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ ట్వీట్ చేశారు. విమాన ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున పరిహారం అందిస్తామని కీలక ప్రకటన చేశారు. ఇది చాలా విషాదకరమైన ఘటన. మా బాధ వర్ణనాతీతం. క్షతగాత్రుల వైద్య ఖర్చులు కూడా తామే మొత్తం భరిస్తాం. ధ్వంసమైన బీజే మెడికల్ కాలేజీకి కొత్త భవనం కట్టిస్తామని చంద్రశేఖరన్ హామీ ఇచ్చారు. కాగా, అహ్మదాబాద్ ఎయిర్పోర్టు నుంచి టేకాఫ్ అయిన కొన్ని సెకన్లలోనే ఎయిరిండియా విమానం ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ప్రమాదంలో విమానంలో ప్రయాణిస్తున్న ప్రయాణికులంతా మృతిచెందారు. ఈ ఘటన మొత్తం దేశాన్ని కలిచివేసింది. పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తమను ఎంతగానో కలచి వేస్తోందని పేర్కొంటూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు.

# మృత్యుంజయుడు..

ప్రమాదానికి గురైన విమానంలో ప్రయాణిస్తున్న అందరూ ప్రాణాలు కోల్పోయారని వార్తలు వెలువడుతున్నాయి. అయితే, ఒక్క వ్యక్తి అంత పెద్ద దుర్ఘటన నుంచి ప్రాణాలతో బయటపడ్డాడు.

ఆ వ్యక్తి పేరు విశ్వాస్ కుమార్ రమేష్. భారత సంతతికి చెందిన ఇతడికి బ్రిటన్ పౌరసత్వం ఉంది. తన కుటుంబ సభ్యులను కలిసేందుకు అతడు ఇటీవల ఇక్కడి వచ్చాడు. తిరిగి లండన్ వెళ్లేందుకు ఎయిరిండియా విమానం ఎక్కాడు. అతడు తన సోదరుడితో కలిసి ప్రయాణిస్తున్నాడు. ఆ సోదరుడి ఆచూకీ మాత్రం ఇప్పటివరకు లభ్యం కాలేదు.




# 'తల్లికి వందనం'.. 67 లక్షల మందికి రూ.10,091కోట్లు



(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులకు వర్తింపజేస్తున్నాం. దీనికోసం రూ.10,091 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఇందులో రూ.1,346 కోట్లు పాఠశాలల అభివద్ధికి వెళ్తుంది. గతంలో 'అమ్మఒడి'కి ఉన్న మార్గదర్శకాలే కొనసాగిస్తున్నాం. అయితే అప్పట్లో ఒకరికి మాత్రమే ఇస్తే.. ఇప్పుడు ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ 'తల్లికి వందనం' ఇస్తున్నాం.

గత ప్రభుత్వం 42,61,965 మందికి ఇస్తే.. మేం 67,27,164 మందికి వర్తింపజేశాం. అప్పటితో పోలిస్తే అదనంగా 24,65,199 మందికి ఇస్తున్నాం. అప్పుడు రూ.5,540 కోట్లు కేటాయిస్తే.. ఇప్పుడు రూ.8,745 కోట్లు ఖర్చు చేస్తున్నాం. రూ.3,205 కోట్లు అదనంగా ఇస్తున్నాం. తల్లి లేకపోతే తండ్రి లేదా సంరక్షకుడి ఖాతాలో జమచేస్తాం. అనాథలకు జిల్లా కలెక్టర్ నిర్ధరించిన ప్రకారం వారి ఖాతాల్లో వేస్తాం. తల్లికి వందనం జాబితాలను గ్రామ,వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచుతాం. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే సరిదిద్ది సహాయం అందిస్తాం. దానికోసం జూన్ 26 వరకు ఫిర్యాదులు స్వీకరించి 30న తుది జాబితాను ప్రకటిస్తాం'' అని చంద్రబాబు తెలిపారు.



# ఏపీ రైతులకు కేంద్రం శుభవార్త..

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ అభ్యర్థనను పరిశీలించి ఖరీఫ్ 2024%-%25 కాలానికి కంది పప్పు సేకరణ గడువును కేంద్రం మరో 15 రోజులు పొడిగించింది. సేకరణ పరిమితి 95,620 మెట్రిక్ టన్నులుగా జూన్ 26 వరకు రైతుల నుంచి కంది పప్పు మద్దతు ధరపై సేకరిస్తారు. ఈ నిర్ణయంలో త్వరితగతిన సహకరించి రైతులకు ఎంతో ఉపయోగపడేలాగా చర్యలు తీసుకున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్కు మా ప్రత్యేక ధన్యవాదాలు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, ఎన్డీఏ ప్రభుత్వం మన రైతుల సంక్షేమం కోసం గ్రామీణ ప్రాంతా అభివద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తోంది' అంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ట్వీట్ చేశారు.

# కాలం బాగోలేదు, అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

క్షమాపణ తెలిపారు. కానీ ఆమె వ్యాఖ్యలు సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో వివాదం చెలరేగింది.

గతంలో ఓ కేసులో బాధితురాలు పేరు చెప్పారని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ పై పోలీసులు కేసు నమోదు చేసారు. గతంలో తనపై బాధితురాలి పేరు చెప్పినట్టు కేసు పెట్టారని గుర్తు చేస్తూ, రాయపాటి శైలజపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టాలని మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజను దళిత సంఘాలు అడ్డుకున్నాయి. ఇదిలా ఉంటే, బాధిత బాలిక కుటుంబ సభ్యులు మొదట బాలు అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేయగా, పోలీసులు దానినే ప్రాధాన్యతగా తీసుకుని విచారణ సాగించారు. దీంతో అసలైన నిందితుడు నరేష్ను గుర్తించడంలో ఆలస్యం అయ్యిందని శైలజ పేర్కొన్నారు.ఇంటర్ విద్యార్థిని తన్మయి కేసులో మొదట బాలు అనే యువకుడిపై పేరెంట్స్ అనుమానం వ్యక్తం చేశారు. దీంతో బాలుపై పోలీసులు ఫోకస్ చేశారు. అందుకే నిందితుడు నరేష్ ను గుర్తించడం ఆలస్యమైంది. ఇప్పటికే పోలీసు నిర్లక్ష్యంపై సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ ను సస్పెండ్ చేశారు. రామగిరి మైనర్ బాలిక పై అత్యాచారం కేసులో నిందితులను పట్టుకున్నాం%ొ%16 మందిని అరెస్ట్ చేసాం. రామగిరి దళిత మైనర్ బాలిక ఘటనలో పార్టీలకు సంబంధం లేదని అన్నారు. ఒక్క పక్క దర్యాప్తు కొనసాగుతుండగా, మరో పక్క మహిళా కమిషన్ చైర్పర్సన్ వ్యాఖ్యలు, ఆమెపై నిరసనలు ఈ ఘటనకు కొత్త మలుపు తిప్పాయి.

# అహ్మదాబాద్ దుర్ఘటన .. ఏపీలో కూటమి ప్రభుత్వం వేడుక వాయిదా

అమరావతి: అహ్మదాబాద్లో ఘోర విమాన ప్రమాద ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈరోజు సాయంత్రం తలపెట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని వాయిదా వేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి గురువారం నాటికి ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలన స్వర్ణాంధ్రప్రదేశ్' పేరుతో రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం ఉత్సవం నిర్వహించాలని నిర్ణయించింది. గుంటూరు జిల్లా అమరావతిలో ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం ఏం సాధించింది, రాబోయే నాలుగేళ్లలో ఎలాంటి లక్ష్యాలు సాధించాలనుకుంటోంది, ఏ విజన్తో అడుగులు ముందుకు వేయనుందన్న అంశాలు ప్రజలకు వివరించేలా ఈ కార్యక్రమం రూపొందించారు. సుపరిపాలన, సమ్మిళిత వద్ధికి పునరంకితం అయ్యేలా ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు.రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, స్వర్ణాంధ్ర విజన్ కార్యాచరణ ప్రణాళిక జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి సభ్యులు, సచివాలయంలోని కీలక అధికారులను ఆహ్వానించారు.

## బిగ్ బాస్కెట్ కలెక్షన్ సెంటర్ ప్రారంభం

### ప్రారంభించిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



శాంతిపురం, జూన్ 12(మనం న్యూస్): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొదలు పెట్టినటువంటి ప్రకృతి వ్యవసాయం పద్ధతులు ఆచరిస్తున్నటువంటి రైతుల పంటలను గురువారం శాంతిపురం మండలం గుండుశెట్టిపల్లి గ్రామం లో డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కుప్పం స్పెషల్ ఆఫీసర్ అమృతవల్లి, టిడిపి పార్టీ నాయకులు విశ్వనాథ నాయుడు, ఉదయ్, విజయరామిరెడ్డి,చంద్ర, నాగరాజు, జయరాం రెడ్డి,అనసూయ,సుగుణమ్మ మరియు పలువురు నాయకులు సిబ్బంది ఆధ్వర్యంలో బిగ్ బాస్కెట్ కలెక్షన్ సెంటర్ ప్రారంభోత్సవం చేయడం జరిగింది.

ఈ సెంటర్ ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పంటలు కూరగాయలు ఆకు కూరలు పండ్లు, ఇతర అన్ని ఆహార ఉత్పత్తులును రైతులు నుంచి సేకరించి మార్కెటింగ్ రేటు మీద 10% అధిక ధరతో కోనుగులు చేయటం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో రైతులు ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానికులు హాజరు కావడం జరిగింది.

## స్విమ్స్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలి

- సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెబాట తప్పదు




తిరుపతి, జూన్ 12(మనం న్యూస్): స్విమ్స్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని గత రెండున్నర సంవత్సరాల కాలంగా అనేక మార్లు అధికారులకు విన్నవించినా, ధర్నాలు చేసినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కార్మికులు ఈనెల నాలుగవ తేదీ స్విమ్స్ డైరెక్టర్ టీటీడీ చైర్మన్, టీటీడీ ఈవో, రాష్ట్ర ప్రభుత్వానికి కార్మిక శాఖకు ప్రజా ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ కు, జిల్లా ఎస్పీకి, అందరికీ చట్టబద్ధంగా సమ్మె నోటీసు రిజిస్టర్ పోస్టులో పంపించడం జరిగిందని, సమ్మె నోటీసు పంపి ఎనిమిది రోజులవుతున్నా యాజమాన్యం మొండిగా వ్యవహరించడంతో స్విమ్స్ ఎమర్జెన్సీ వార్డ్ ముందు ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, జిల్లా అధ్యక్షులు జి బాల సుబ్రమణ్యం, స్విమ్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే వేణుగోపాల్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.మాధవ్, హాకర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.బుజ్జి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. గత రెండున్నర ఏళ్లుగా శానిటేషన్ పేరు మార్చి గతంలో మా వార్డు బాయిలుగా పరిగణించాలని కోరుతూ పలుమార్లు విన్నపాలు చేశామని, అధికారులు చేసిన పొరపాటుకు ఏళ్ల తరబడి నుండి తక్కువ వేతనాలకు పనిచేయాల్సి వస్తుందని, మా హోదాను మార్చండి వేతనాలు పెంచండి అని అధికారుల చుట్టూ కాళ్లు నరికేలా తిరుగుతున్న పట్టించుకోని సమ్మె నోటీసు ఇస్తే సమ్మెలు ఆసుపత్రిలో నిషేధం నీపై చర్యలు తీసుకుంటామని నోటీసులు ఇస్తున్నారంటే ఇంతకంటే దుర్మార్గం అన్యాయం ఇంకొకటి ఉండదని తెలిపారు. ఎంతకాలం బానిసల్లా పని చేయమంటారు విధిలేక చేపట్టిన ఈ సమ్మె మేము ఇష్టంతో చేస్తున్నది కాదని ఎంతో బాధతో కష్టంతో చేస్తున్నదని సమ్మె నోటీసు చట్టబద్ధంగా నిరసన తెలియజేస్తూ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు బెదిరింపులు కార్మిక సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో 18వ తేదీ తరువాత కార్మికులు ఏ క్షణంలోనైనా సమ్మె పాట పడటం తప్పదని సమ్మె బాట పడితే ప్రతి పరిణామానికి బాధ్యత స్విమ్స్ యాజమాన్యం వహించాలని ఆ పరిస్థితులు తెచ్చుకోక వెంటనే సమస్యను పరిష్కారం కావాలని సిఐటియు యూనియన్ డిమాండ్ చేస్తున్నదని అన్నారు. ఎప్పటికే కార్మికులు చేస్తున్న పోరాటానికి అశేష స్పందన మద్దతు లభిస్తుందని యాజమాన్యం స్పందించకుంటే సమ్మె బాట తప్పదన్నారు. స్విమ్స్ కార్మికులు రవి, సూరి, వెంకటేష్, గోపి, భాష, వేలు, కుమారి, జయమ్మా పాల్గొన్నారు.

## అన్నాక్యాంటీన్లలో నాణ్యమైన ఆహారం

### కమిషనర్ ఎన్.మౌర్య



తిరుపతి, జూన్ 12(మనం న్యూస్): అన్నా క్యాంటీన్లలో ఒక నిర్దిష్టమైన సమయంలో నాణ్యమైన ఆహారం ప్రజలకు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య నిర్వాహకులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరంలోని ఎమ్మార్ పల్లి లోని అన్నా క్యాంటీన్, రవీంద్ర నగర్, కేశవాయనగుంట, ఎమ్మార్ పల్లి టిటిడి ప్లాట్స్ వద్ద ప్రజల నుండి వచ్చిన సమస్యలను, జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్నా క్యాంటీన్లలో ఒక నిర్దిష్ట సమయంలో ఆహార పదార్థాలను అందించాలని అన్నారు. క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. రవీంద్ర నగర్, కేశవాయనగుంట, ఎమ్మార్ పల్లి టిటిడి ప్లాట్స్ వద్ద పారిశుద్ధ్య పనులను మెరుగ్గా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. చెత్తను రోడ్లపైన, కాలువల్లో వేయవద్దని ప్రజలకు సూచించారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. మహేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

# కేంద్రం, రాష్ట్రంలో ప్రజా వంచన పాలన

- పీసీసీ ప్రధాన కార్యదర్శి ఈద సుధాకర్ రెడ్డి



తిరుపతి, జూన్ 12(మనం న్యూస్): కేంద్రంలో, రాష్ట్రంలో ప్రజావంచన పాలనలు కొనసాగుతున్నాయని పిసిసి ప్రధాన కార్యదర్శి ఈద సుధాకర్ రెడ్డి ఆరోపించారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు గౌడపేర చిట్టి బాబు గురువారం నగర నూతన కమిటీని ప్రకటించారు. ఈసందర్భంగా విలేకరుల సమావేశంలో ఈదా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డదారిలో అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రధానంగా దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఈవీఎంలను అడ్డుపెట్టుకొని బిజెపి ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా అధికారంలోకి వస్తోందని ఆయన విమర్శించారు. దేశంలో తమను మించిన దేశభక్తి పరాయణులు లేరని చెప్పుకుంటూ ప్రజలను మభ్యపెడుతోందని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. తిరుపతి నగర అధ్యక్షులు గౌడ పేరు చిట్టిబాబు మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రజా సమస్యలు పెరిగి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక ప్రజలు అవస్థలు పడుతున్నారని వారికి అండగా కాంగ్రెస్ పార్టీ నిలబడుతుందని వివరించారు. ఇందులో భాగంగానే ప్రజా సమస్యలపై చిత్త శుద్ధితో పోరాటాలు చేయడానికి నూతన నగర కమిటీని ఏర్పాటు చేశామని తెలియజేశారు. తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా పార్థసారథి రెడ్డి, గొడుగు చింతల గోపి, నాగరాజు యాదవ్, పివి రమేష్, ప్రధాన కార్యదర్శులుగా తలారి గోపీచంద్, కె చంగల్ రాయులు, పలమందల శివకుమార్ కే మహేష్ బాబు, కృష్ణమూర్తి, కార్యదర్శులుగా జి. మోహన్, పి జగపతిబాబు, జయకుమార్, సైమన్ చక్రి, శివశక్తి, టి మణికంఠ, వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కే దవన్ కళ్యాణ్, మందల సాయి, కార్యవర్గ సభ్యులుగా కే వినోద్ కుమార్, ఎం వాసు, రాజగోపాల్, ఎస్సీ విభాగం చైర్మన్గా వై నవీన్ కుమార్, ఎస్టీ విభాగం చైర్మన్ గా కె ధనంజయ కుమార్, అసంఘటిత రంగ వర్కర్ల ఉద్యోగుల కాంగ్రెస్ కమిటీ చైర్మన్గా దాసరి చిరంజీవి, మైనారిటీ విభాగం చైర్మన్గా పి సలీముల్లా లను నియమించడం జరిగిందన్నారు. పిసిసి అధ్యక్షురాలు శ్రీ షర్మిల గారి ఆదేశాల మేరకు ఏర్పాటైన ఈ నూతన కమిటీ నగరంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అండగా నిలబడి వారి సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. నూతనంగా ఎంపికైన సభ్యులకు పార్టీ కండువాలు కప్పి నియామక పత్రాలను అందజేశారు. తిరుపతి జిల్లా అధ్యక్షులు బాల గురవం బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందని ఆరోపించారు. ఏడాది పాలనలో కూటమి నాయకులు బాగుపడ్డారే తప్ప ప్రజా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని తెలియజేశారు. తిరుపతి జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని ఆయన చెప్పారు. పిసిసి ఉపాధ్యక్షుడు రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాజధాని అమరావతిపై విద్వేష పూరిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర పురోగతికి సహకరించాలి తప్ప విద్వేషాలు రెచ్చగొట్టడం మంచిది కాదన్నారు.

పిసిసి ప్రధాన కార్యదర్శి మాంగాటి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ నగర నూతన కమిటీ మరింత ఉత్సాహంగా ప్రజల పక్షాన నిలబడాలని ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టాలని పిలుపునిస్తూ నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కార్యక్రమంలో ఏఐసీసీ బీసీ సెల్ కోఆర్డినేటర్ కంభంపాటి మురళీకృష్ణ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి సింధుజ, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సుప్రజ, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ప్రతినిధి సిద్దయ్య, డి సి సి ప్రధాన కార్యదర్శి కళందర్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిత్తూరు శివశంకర్, తిరుపతి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ముస్లిం తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల ఘాట్ రోడ్డులలో వేగంగా బీటీ రోడ్డు పనులు



- వాహనదారులు మరింత అప్రమత్తంగా వాహనాలను నడపాలని టీటీడీ విజ్ఞప్తి

తిరుమల, జూన్ 12, మనం న్యూస్: శ్రీవారి భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఘాట్ రోడ్డును మూసివేయకుండా నిర్దేశించిన సమయంలో మరమ్మత్తు పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. కనుక, భక్తులు తమ తిరుమల ప్రయాణాన్ని ప్రణాళికా బద్ధంగా మార్చుకుని కనీసం గంట సమయం ముందుగా ప్రారంభించాలని టిటిడి కోరుతోంది. మరమ్మతుల కారణంగా వాహనదారులు నెమ్మదిగా అక్కడక్కడా కొద్ది సేపు ఆగుతూ ప్రయాణించాల్సి ఉంటుందనే విషయాన్ని భక్తులు గమనించగలరు. భక్తులు మరింత సులభంగా, సౌకర్యంగా ప్రయాణించేందుకు ఈ మరమ్మతు పనులను టిటిడి చేపట్టింది. ఈ నేపథ్యంలో భక్తులు రేణిగుంట విమానాశ్రయం, తిరుపతి రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్ స్టాండ్ ప్రాంతాల నుండి తిరుమల విచ్చేసే వాహనదారులు ముందస్తుగా ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవాలని టిటిడి సూచిస్తోంది. మరమ్మతు పనులను పూర్తి చేయడానికి టిటిడిలోని ప్రతి విభాగం అప్రమత్తంగా ఏర్పాట్లు చేపట్టింది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని వాహనదారులు తిరుమల చేరుకోవాలని టిటిడి విజ్ఞప్తి చేయడమైనది. నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి కావడానికి భక్తులు, వాహదారులు సహకరించాలని టిటిడి కోరుతోంది. అత్యవసర సేవలకు టిటిడి టోల్ ఫ్రీ నెంబర్ 155257 కు సంప్రదించండి.

## ప్రజా ప్రభుత్వానికి ఏడాది.. కేక్ కట్ చేసిన ఎమ్మెల్సీ కంచర్ల



కుప్పం, జూన్ 12 (మనం న్యూస్): కుప్పం నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కేక్ కట్ చేసి ఎన్డీఏ కూటమి శ్రేణులకు తినిపించారు. అనంతరం టపాసులు పేల్చి సంబరాలు చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ గత వైసీపీ పాలకులు చేసిన అరాచకాల నుండి, రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో ముందుకు నడుపుతున్న కూటమి ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగించి నేటికీ ఏడాది పూర్తయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అభివృద్ధి సంక్షేమాన్నే లక్ష్యంగా ప్రజలకు పాలన అందిస్తుందన్నారుగత వైసీపీ పాలకులు అరాచకాన్ని ప్రోత్సహిస్తే, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. గతంలో పాలించిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ఒక తట్ట మట్టి పోసి ఒక గుంత అయినా పూడ్చారా అని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు తప్ప ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపాలన్నారు. బటన్ నొక్కుడు పేరుతో ప్రశ్నించే వారిని గొంతు నొక్కడమే జగన్ రెడ్డి ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో మహిళల సామాజిక స్వేచ్ఛకు, ఆర్థిక స్వేచ్ఛకు, రాజకీయ స్వేచ్ఛకు తెలుగుదేశం పార్టీ పునాదులు వేస్తే, వైసీపీ ప్రభుత్వం మహిళలను అవమానపరుస్తూ మహిళల గౌరవాన్ని కించపరుస్తూ పాలన కొనసాగించిందన్నారు. ఇటీవల అమరావతి రాజధానిలోని మహిళలను అగౌరవపరుస్తూ సాక్షి మీడియాలో జగన్ అనుచరులు మాట్లాడిన మాటలు రాష్ట్రంలోని మహిళల ఆత్మగౌరవాన్నిదెబ్బతీశాయన్నారు. అదేవిధంగా పొదిలిలో జగన్ పర్యటన సందర్భంగా మహిళల పై, మరియు పోలీసుల పై వైసీపీ శ్రేణులు చేసిన దాడి ఆ పార్టీ పైశాచిక తత్వానికి నిదర్శనం అన్నారు.. రాష్ట్రంలోని మహిళలను కించపరుస్తూ సొంత మీడియా మరియు పార్టీ శ్రేణులు మాట్లాడుతుంటే, పార్టీ అధినేతగా దండించాల్సింది పోయి అలాంటి వారిని ప్రోత్సహించడం తన శాడీజానికి నిదర్శనం అన్నారు. గంజాయి మూకలకు అండగా నిలవడం రౌడీ మూకలకు మద్దతు ఇవ్వడం వైసిపి అధినేత నైజం అని, రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం తో ప్రజలు సంబరాలు జరుపుకుంటుంటే అది ఓర్వలేని జగన్మోహన్ రెడ్డి అక్కస్సుతో అరాచకం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాడని వారు చేసే అరాచక కార్యక్రమాలను ప్రజలు తిప్పి కొడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు, మహిళా నేతలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఏపీకి డబుల్ ధమాకా

- కేంద్రం అత్యధిక నిధులు అందిస్తున్నాం
- మోదీ పాలన స్వర్ణయుగం
- బండి సంజయ్



తిరుపతి, జూన్ 11(మనం న్యూస్): డబుల్ ఇంజిన్ సర్కార్ (కేంద్ర రాష్ట్రాల్లో ఒకే కూటమి పాలన)వల్ల ఆంధ్రప్రదేశ్ కు డబుల్ ధమాకా లభించిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఏ రాష్ట్రానికి లేనంతంగా ఏపీకి కేంద్రం నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఏపీని గట్టెక్కించేందుకు ప్రత్యేక ఆర్థిక సాయం అందిస్తోందన్నారు అన్నారు. తిరుపతిలో కేంద్రమంత్రి బండి సంజయ్ బుధవారం పర్యటించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మోదీ 11 ఏళ్ల పాలన విశేషాలను వివరించారు. ఇప్పటికే ఏపీకి 8 కేంద్రీయ విద్యాలయాలను కేంద్రం ఇచ్చిందని, రాష్ట్రంలో ఇప్పటి వరకు 4,741 కి.మీ హైవేలను నిర్మించామని వెల్లడించారు. పలు ఎయిర్పోర్టు లను మరింత ఆధునీకరిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే రైల్వే బడ్జెట్లో ఏపీకి పెద్దపీట వేశామని, అమృత్ మహోత్సవంలో భాగంగా.. రాష్ట్రంలోని అనేక రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే ఏపీకి 24 లక్షల ఇళ్లను మంజూరు చేశామని కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. దేశమంతా ప్రధాని మోడీ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ను కోరుకుంటోందని, ఈ డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే ఏపీలో అభివృద్ధి మెరుపు వేగంతో జరుగుతోందని బండి సంజయ్ అన్నారు. ఇప్పటికే ఏపీకి 8 కేంద్రీయ విద్యాలయాలను కేంద్రం ఇచ్చిందని, రాష్ట్రంలో ఇప్పటి వరకు 4,741 కి.మీ హైవేలను నిర్మించామని.. పలు ఎయిర్పోర్టులను మరింత ఆధునీకరిస్తున్నామని కేంద్ర మంత్రి చెప్పుకొచ్చారు. అలాగే రైల్వే బడ్జెట్లో ఏపీకి పెద్దపీట వేశామని, అమృత్ మహోత్సవంలో భాగంగా.. రాష్ట్రంలోని అనేక రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని, ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే ఏపీకి 24 లక్షల ఇళ్లను మంజూరు చేశామని కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో చెప్పుకొచ్చారు.

# రైతుల నుంచి బలవంతపు భూసేకరణ జరగదు

- స్పష్టం చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాదరి



శాంతిపురం,జూన్ 12(మనం న్యూస్): రైతుల అంగీకారంతోనే కుప్పం గ్రీన్ ఫీల్ ఎయిర్పోర్ట్ కోసం భూసేకరణ జరుగుతుందని, బలవంతపు భూసేకరణ జరగదని చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి స్పష్టం చేశారు. గురువారం శాంతిపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎయిర్ పోర్ట్ భూ బాధితుల కోసం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ భూసేకరణ కోసం శాంతిపురం మండల పరిధిలోకి వచ్చే దండి కుప్పం, 30 సొన్నేగానిపల్లి, అమ్మవారిపేట, రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతులతో జెసి అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతుల అభిప్రాయాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. కొంతమంది రైతులు మాట్లాడుతూ విమానాశ్రయం ఏర్పాటు కొరకు చేపడుతున్న భూసేకరణలో తరతరాలుగా వారసత్వంగా వచ్చిన తమ భూములను ప్రభుత్వం తీసుకోవడంతో తాము సర్వం కోల్పోతున్నామని వాపోయారు. రెక్కలు ముక్కలు చేసుకొని రాళ్లు రప్పలు తొలగించి లక్షల రూపాయలు ఖర్చు చేసి వ్యవసాయానికి అనుకూలంగా మలుచుకొని వ్యవసాయమే తమ జీవనాధారంగా చేసుకొని భూమిని నమ్ముకుని జీవిస్తున్న తమ భూములను ఎయిర్ పోర్టుకు తీసుకుంటే తాము ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. భూములను కోల్పోతున్న రైతులకు ప్రత్యామ్నాయంగా భూములను ఇవ్వాలని అలాగే ఇండ్లు కోల్పోతున్న వారికి ఇంటి పట్టాలి ఇచ్చి ఇల్లు కట్టివ్వాలని కోరారు. ఉన్నత చదువులు చదివి ఇంటివద్దే వ్యవసాయ పనులు చేసుకుంటున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే 2017 లో విమానాశ్రయ నిర్మాణం కోసం రైతుల నుండి సేకరించిన భూములకు ఇప్పటివరకు పరిహారం అందించలేదని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా భూ సేకరణ కోసం చేపడుతున్న సర్వేలను అడ్డుకొని భూములను ప్రభుత్వానికి ఇవ్వకుంటే ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకి 16 లక్షల రూపాయల పరిహారం అందివ్వమని పది లక్షల రూపాయల మాత్రమే వచ్చేటట్టు చేస్తామని కొంతమంది అధికారులు బలవంతపు భూసేకరణ చేస్తామంటున్నారని రైతులు తెలిపారు. ఇందుకు జెసి బదులిస్తూ ఏ అధికారి గానీ బలవంతపు భూసేకరణకు పాల్పడబోరని రైతుల అభిప్రాయాల సేకరణ తర్వాతే వారి నుంచి భూమిని సేకరిస్తామని స్పష్టం చేశారు విమానాశ్రయ భూబాధితులకు ప్రభుత్వం ఎకరాకు 16 లక్షల రూపాయలు అందించే విధంగా స్పష్టమైన హామీ ఇచ్చిందని ఈ పరిహారాన్ని సదరు బాధిత రైతులకు అందజేస్తామని తెలిపారు ఇక భూముల కోల్పోతున్న రైతుల కోరుతున్న విధంగా ఉద్యోగాలు కల్పన అనేది తన పరిధిలో లేని అంశం అని జెసి స్పష్టం చేశారు. ఉద్యోగ కల్పన కోసం ప్రభుత్వం నిర్వహించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగ ప్రకటన సమయంలో సంబంధిత విద్యార్హతలు కలిగిన వారు నమోదు చేసుకుని నియమనిబంధనల ప్రకారం ఉద్యోగం పొందాల్సి ఉంటుందన్నారు. ఇల్లు కోల్పోయిన వారికి ఇల్లు కట్టించడం పట్టాలిపించడం అలాగే సంబంధిత వ్యవసాయ రైతుల భూములలో ఉన్న మృత్యసంబదకు తగిన నష్టపరిహారాన్ని అందించడం కోసం తను కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేతలు మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, మండల తెదేపా అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు, అఖిలపక్ష నేతలు ఆవుల గోపి, మునుస్వామి, నిజాం, అధికారులు ఎంపీడీవో ఏపిఆర్ కుమార్, తహసిల్దార్ శివయ్య, కుప్పం రూరల్ సీఐ జె. మల్లేష్ యాదవ్, రాళ్ళబూదుగూరు, రామకుప్పం, ఎస్సైలు నరేష్, మోహన్, పోలీసు రెవెన్యూ సిబ్బంది ఇతర నాయకులు పాల్గొన్నారు.

## సహ చట్టాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలి: ఎంపీ



చిత్తూరు, జూన్ 12(మనం న్యూస్): సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. గురువారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్లో జాతీయ అధ్యక్షులు ప్రత్తిపాటి చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఫోరమ్ ఫర్ ఆర్టీఐ టీమ్ చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎఫ్ ఆర్టీఐ సమాచార హక్కు చట్టం పై రూపొందించిన బేర్ అక్ట్ ను చిత్తూరు పార్లమెంటు సభ్యులు ఆవిష్కరించారు. ఎఫ్ ఆర్టీఐ నీతి నిజాయితీగా ప్రజల కోసం స్వచ్ఛందంగా చేస్తున్న కార్యక్రమాలను ప్రత్తిపాటి చంద్రమోహన్ వివరించారు. ఎంపీ దగ్గుమళ్ళ..ఎఫ్ ఆర్టీఐ సభ్యుల సేవలను ప్రశంసించారు.

## విద్యార్థులకు వరం బాల్ పెన్



రాయడానికి అందుబాటులో ఉన్న ఏకైక ఉత్తమ సాధనం బాల్ పాయింట్ పెన్ లేదా బాల్ పెన్ అని మనకు తెలుసు. చిన్నారి నుంచి పండు ముసలి వరకు అందరి హస్త భూషణం బాల్ పెన్. బాల్ పెన్ను చూడని, స్పృశించని వారు ఉంటారా ! నేడు ప్రపంచవ్యాప్తంగా పెన్ను అంటేనే బాల్ పాయింట్ పెన్ అన్నది నిర్వివాదాంశం. గతంలో ఇంకులో ముంచి రాసుకునే పెన్నులు, సిరా నింపి రాసుకునే పెన్నులను చూసాం. నేడు ఇంకు పెన్నులు క్రమంగా అంతరించిపోతున్నాయి. కనుకనే బాల్ పాయింట్ పెన్ను మన నేస్తం అయ్యింది.

1888లో జాన్ లావుడ్ అనే శాస్త్రవేత్త ఇంకు పెన్నును కనుగొనడం జరిగింది. ఇంకు పెన్ను వాడుకలో వచ్చిన అసౌకర్యాల వల్ల మరో మెరుగైన పెన్ను అవసరం ఏర్పడింది. 1938లో లాజ్లో బిరో అనే హంగేరియన్ జర్నలిస్టు బాల్ పాయింట్ పెన్నులు రూపొందించడం, తర్వాత 10 జూన్ 1943న తన సోదరుడు ఇంజనీర్ జియార్జీ బిరోతో కలిసి బాల్ పాయింట్ పెన్నును పెటెంట్ చేయడం జరిగింది. ఈ ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి ఏట 10 జూన్న ప్రపంచ దేశాలు జాతీయ బాల్ పాయింట్ పెన్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. నాటి నుంచి నేటి వరకు విద్యాలయాలు, విద్యావంతులు, వ్యాపారవేత్తలు, కార్యాలయాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, అన్ని వర్గాల ప్రజలు, పిల్లలకు ఆత్మీయ నేస్తంగా, గౌరవాన్ని పెంచే సాధనంగా, జేబుకు అలంకారంగా బాల్ పాయింట్ పెన్ను సేవలను అందిస్తున్నది. బాల్ పాయింట్ పెన్ సాధనంగా విద్యా బోధనలు, సాంస్కృతిక వికాసం, ఆర్థిక వ్యవస్థలు, సగటు మనిషి జీవనశైలిలో ఓ అవిభాజ్య భాగం అయ్యింది. ఒక్క బాల్ పాయింట్ పెన్‌తో దాదాపు 50,000 పదాలు రాస్తూ 100 పేజీల వరకు రాయవచ్చు. ప్రతి ఒక్కరు సాలీనా సగటున 4.3 బాల్ పెన్నులను వాడడం జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా సెకనుకు 125 బాల్ పెన్నుల అమ్మకాలు జరుగుతున్నాయి. పలు రకాల బ్రాండ్లు, అద్భుత ఆకృతులు, ఆకర్షణీయ కళా సంపదలతో బాల్ పెన్నులు మనకు అందుబాటులో ఉన్నాయి. అందరికీ అందుబాటులో ఉన్న బాల్ పాయింట్ పెన్నులు నమ్మకమైన, నాణ్యమైన, మృదు రాతల ధారలు పారిస్తున్నాయి. తేలికగా పేపరుపై పారడం, సులభంగా ఆరిపోవడం, అందమైన రాతలకు వారధిగా కావడం బాల్ పెన్ను ప్రత్యేకతలుగా పేర్కొనాలి.

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# బాల్యం చుట్టూ కారు చీకట్లు



బాల్యం ఒక అద్భుతమైన వరం. ప్రతీ ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో బాల్యం తిరిగి రావాలని ఆశపడుతుంటారు. అలాంటి బాల్యాన్ని పోగొట్టుకోవడం దురదృష్టకరం.

బాల్యదశను సక్రమంగా వినియోగించక పోతే ప్రపంచ గతి అధోగతే.మానసిక పరిపక్వత రాని దశలో మానసిక ఉల్లాసం కోసం బాల్యాన్ని ఆట పాటలతో, చదువులతో నింపాలి. అయితే కొంత మంది బాల్యాన్ని బందీ చేస్తున్నారు. వెట్టి చాకిరీకి గురి చేస్తున్నారు. బాలికలపై ప్రపంచ వ్యాప్తంగా లైంగిక హింస కొనసాగడం అత్యంత దారుణం.

బాల్య విలాపం సమాజానికి శాపం. బాల్యాన్ని చిదిమేస్తే భవిష్యత్తు శూన్యమైపోతుంది.బాలలు భవిష్యత్తుకు సారథులు. బాలల వికాసం అభ్యుదయానికి సోపానం. అలాంటి బాలలు విద్యాబుద్ధులకు దూరమై, చీకట్లో మగ్గిపోతే ప్రగతి రథచక్రాలు చతికిలపడక తప్పదు.

బాల్య,యౌవన,కౌమార,వార్ధక్య దశల్లో 'బాల్యం' అనేది ప్రతీ వ్యక్తి జీవితంలో మరపురాని మధుర ఘట్టం .ఆటపాటలకు, చదువు సంధ్యలకు మానసికోల్లాసానికి ఒక మహత్తర అవకాశం బాల్యం. బాల్యదశల్లో పూర్వ బాల్యదశ,ఉత్తర బాల్యదశ కీలకమైనవి. ఈ రెండు దశల వ్యవధి 12 సంవత్సరాలు. ఈ వ్యవధిలోనే బాలల్లో మానసిక, నైతిక వికాసం కలిగించాలి. విజ్ఞాన జిజ్ఞాసను ప్రేరేపించాలి. బాల్య దశ జీవితంలో మిగిలిన దశలను సక్రమంగా నడిపించడానికి దోహదం చేసే అత్యంత కీలక దశ. బాల్యదశ గాడి తప్పి క్రమశిక్షణ లేకుండా గడిస్తే జీవితమంతా కష్టాల పాలు కాక తప్పదు.ప్రస్తుత బాలప్రపంచం అనేక సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నది. బాలల హక్కులు హరించబడుతున్నాయి. చాలా మంది బాలలు విద్యకు నోచుకోక, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులు అనుకూలించక, వెట్టిచాకిరీ చేస్తూ, బాలకార్మికులుగా మిగిలిపోతున్నారు.ఇది తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన. ప్రపంచంలో సుమారు 121 మిలియన్లకు పైగా బాలకార్మికులున్నారు.ఇందులో అత్యధిక శాతం మంది ప్రమాదకరమైన పనుల్లో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బాలల సంక్షేమం కేవలం కాగితాలకే పరిమితమౌతున్నది. బాలల సంక్షేమమంటే వెట్టిచాకిరీ కాదు. బాలలందరికీ ప్రేవేటు, ప్రభుత్వ రంగ సంస్థలనే వ్యత్యాసం లేకుండా ఉచిత, విద్య, వైద్య సదుపాయాలను కల్పించాలి. పౌష్టికాహారం అందించాలి. చట్టాల కళ్ళు గప్పి, అనధికారికంగా చెలామణీ అవుతున్న బాలకార్మిక వ్యవస్థను కూకటివ్రేళ్ళతో సహా పెకలించాలి. బాలలు స్వేచ్ఛగా,ప్రశాంతమైన వాతావరణంలో చదువుకుని,మానసిక ఉల్లాసంతో పెరగాలి. బాలలే ప్రపంచ స్థితిగతులను మార్చే రేపటి మేధావులు. బాలల పెంపకంలో తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి. పెద్దల దురలవాట్లు పిల్లలకు శాపం. తమ పిల్లల కోసమైనా పెద్దలు వ్యసనాలను వదిలేయాలి. బాలలను సంస్కరించే ముందు పెద్దలు సంస్కరించబడాలి. తల్లిదండ్రుల ప్రవర్తన సరిగా ఉంటేనే పిల్లలు ఉత్తములుగా తీర్చిదిద్దబడతారు. పెద్దలు ముందుగా నైతిక ప్రవర్తనతో మెలగాలి.మనం చెప్పే నీతులకు,ఆచరణకు పొంతన లేకపోతే అవన్నీ 'నల్ల గురివింద గింజ' సామెతను తలపిస్తాయి. మన ప్రవర్తన సరిగా ఉంటేనే భవిష్య తరానికి మార్గనిర్దేశనం చేసే నైతిక శక్తి సామర్థ్యాలను కలిగి ఉంటాము. తాము బ్రతకడం కోసం



బాలలను ప్రమాదకరమైన పనుల్లో నియమించి, చదువుకు దూరం చేసి, బాల్యాన్ని హరించడం హేయం. బాలలకు చదువుకునే హక్కును దూరం చేయడం మహా ఘోరం. బాలల హక్కులను పరిరక్షించడం, బాలలను భౌతిక, మానసిక, లైంగిక హింసల నుండి కాపాడి, వారిని ఆహ్లాదకరమైన వాతావరణంలో పెంచడం అతిముఖ్యం. ఆర్థిక ఇబ్బందులతో కొంతమంది, చదువుకోవడానికి మౌలిక సదుపాయాలు లేక కొంతమంది బాలలు విద్యకు దూరమౌతుంటే, కొన్ని పాఠశాలల్లో బాలికలు చదవడానికి అనుకూలమైన పరిస్థితులు లేకపోవడం వలన బాలికల విద్య అడుగంటుతున్నది.

బాలల హక్కులను కాలరాసే చీకటి వ్యవస్థలు ప్రపంచమంతా తిష్ఠవేశాయి. కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో వేడి నీళ్ళకు చన్నీళ్ళు తోడై నట్టుగా తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపించకుండా పనులకు పంపించడం వలన బాలలు తమ బంగారు భవితవ్యాన్ని కోల్పోతున్నారు. విద్యాబుద్ధులు లేకపోవడంతో ఇతరుల చేతుల్లో కీలు బొమ్మలుగా మారి అసాంఘిక శక్తులుగా మారుతున్నారు. వీధి బాలలుగా,అనాథలుగా గడుపుతూ యుక్తవయసులో వ్యసనాలకు అలవాటు పడి, డబ్బు కోసం దేనికైనా తెగించడానికి సిద్ధపడుతున్నారు. ఉన్మాదు లుగా, ఉగ్రవాదులుగా, చీకటి సామ్రాజ్యంలో బానిసత్వం చేస్తున్నారు. ప్రపంచమంతా ఆధునికత్వం సంతరించుకుంది. ఈ ఆధునిక యుగంలో కూడా బాలలు నిర్లక్ష్యానికి, అణచివేతకు గురై, మానసిక వికాసానికి దూరమై అత్యంత దారుణమైన పరిస్థితులకు నెట్టబడుతున్నారు. అనేక మంది బాలికలు అత్యాచార బాధితులుగా మిగిలిపోతున్నారు. చిరుమొగ్గలను తుంచేసే పశుత్వం ప్రబలిపోయింది. చట్టాలెన్ని చేసినా, ప్రపంచ కార్మిక సంస్థ ఎన్ని నియమాలు రూపొందించినా అవి ఆచరణ రూపం బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని అంతర్జాతీయ కార్మిక సంస్థ మరియు అనేక ప్రభుత్వాలు చట్టాలను రూపొందించాయి. కరోనా సంక్షోభం వలన మధ్యతరగతి జీవితాలు ఆర్థికంగా చితికిపోయాయి. యుద్ధాల వలన, ఆర్థిక మాంద్యం వలన ఏర్పడుతున్న పరిస్థితులు బాలల భవిష్యత్తును అంధకార బంధురం చేస్తున్నాయి. ప్రభుత్వాలు బాలల కోసం ఎన్ని పథకాలు చేపట్టినా అవి కేవలం ఊతకర్రలా పనికొస్తాయే గాని పూర్తిగా మనల్ని ఆదుకోలేవు. ఇలాంటి పరిస్థితుల్లో మరలా బాలలు ఉదరనిమిత్తం పనిపాటలకు పోవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కోవిడ్ వలన ప్రపంచవ్యాప్తంగా సుమారు అధిక శాతం విద్యాలయాలు మూతబడ్డాయి. బాలలంతా విద్యకు దూరంగా ఉన్నారు. అయితే ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడుతున్నా, ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం తిరిగి బాలలను అధోగతి పాలు చేస్తున్నది. యుద్ధాల వలన అంతంత మాత్రంగా ఉన్న బాలల బ్రతుకులు మరింత క్షీణదశకు చేరే అవకాశాలున్నాయి. ప్రభుత్వాలు ఈ విషయాన్ని గ్రహించి బాలల చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రత్యేక నిధులు విడుదల చేయాలి. యునెస్కో కూడా ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో బాలలపై మరింత శ్రద్ధ వహించాలి. బాలలంతా చదువులకు స్వస్తి చెప్పి, బ్రతుకుదెరువు కోసం వివిధ రకాల పనులు చేస్తూ కష్టాలు పడుతున్న నేపథ్యంలో జూన్ 12 న జరిగే బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం ప్రాధాన్యత సంతరించుకున్నది. బాలల హక్కుల గురించి ప్రజల్లో అవగాహన, చైతన్యం కలిగించే ఉద్దేశ్యంతో ఐ.ఎల్.ఓ, యునిసెఫ్‌లు కృషి చేస్తున్నాయి.ఆర్థిక మాంద్యం వలన ప్రపంచంలో చాలా దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ పరిస్థితుల్లో మధ్యతరగతి బాలల భవిత అగమ్యగోచరంగా తయారైంది.ఈ సంక్షోభాన్ని అధిగమించి, బాలలను కాపాడాలి. ఆనందంగా గడపవలసిన బాల్యం వెట్టిచాకిరీ వ్యవస్థతో మసకబారిపోవడం దురదృష్టకరం.

బాల్యంలోనే భిక్షాటన మన సామాజిక వ్యవస్థకు పెనుశాపం. చిత్తుకాగితాలు ఏరుకోవడానికి అలవాటుపడి కొంతమంది అసాంఘిక శక్తులచేతుల్లో కీలుబొమ్మలుగా మారిపోతున్న బాలలెంతోమందిని మనం చూస్తున్నాం. మత్తుపదార్థాల చేరవేతలో బాలలను కీలుబొమ్మలుగా మార్చడం దురదృష్టకరం. బాలల బంగారు భవితను చీకటిమయం చేస్తున్న మాఫియా ముఠాల చేతుల్లో, ఉగ్రవాదులకు చేదోడునిచ్చే అసాంఘిక వ్యవస్థల చేతుల్లో బాల్యం చిక్కి శల్యమౌతున్నది.'ఉన్నతమైన ఆలోచనలకు తరగతి గదులే మాతృక' అందరితో సమానమైన విద్య అందక చాలామంది పిల్లలు సమాజంలో ఒక మూలకు నెట్టబడుతున్నారు. ఆర్థిక సామాజిక పరిస్థితులే వీటికి మూలకారణం. ఇలాంటి వారిని గుర్తించి ముందుకు నడిపించవలసిన బాధ్యత అందరిపైనా ఉంది.గ్రామీణ నేపథ్యమున్న చిన్నారులలోనే ఇలాంటి పరిస్థితులు ఎదురుకావడం చూస్తున్నాం. సాధ్యమైనంత తొందరగా ఇలాంటి పరిస్థితుల నుండి చిన్నారులను వెలికితీసి, వారి భవిష్యత్తు ను తీర్చిదిద్దవలసిన గురుతరమైన బాధ్యత సమాజంలోని ప్రతీ ఒక్కరిపైనా ఉంది. నేటి సామాజిక వ్యవస్థలో త్రాగుడు అనే వ్యసనం వ్రేళ్ళూనుకుపోయింది. తాగుడు వ్యసనానికి బానిసలైన పెద్దలు పిల్లలను బడికి పంపకుండా పనిపాటలకు పంపించి ఆ డబ్బుతో మరింత వ్యసనపరులుగా మారడమే కాకుండా వారిని నిరంతరం డబ్బుకోసం హింసిస్తూ పీడించుకు తినడమే కాకుండా బాలకార్మిక వ్యవస్థ మరింత బలిష్ఠం కావడానికి దోహదం చేస్తున్నారు. ఈ పరిస్థితులు మారాలంటే ముందుగా పెద్దలు మారాలి. వారి వ్యసనాలు తగ్గాలి. పిల్లలను పీక్కుతునే రాబంధుల్లా కాకుండా సమాజంలో తమకంటూ ఒక గౌరవనీయమైన స్థానాన్ని కల్పించుకోవాలి. దుర్వ్యసనాలకు దూరంగా జరగాలి. చిన్నపిల్లలను పనిపాటలకు కాకుండా చదువులమ్మ తల్లి ఒడికి చేర్చాలి. ఇది అంత సులువైన వ్యవహారం కాకపోయినా 'తినగ తినగ వేము తియ్యనుండు...' చందంగా మన మంచి మాటల ద్వారా రాను రాను వారిలో మార్పుతీసుకు రావాలి. తక్కువ ఖర్చుతో బాలలను పనిపాటలకు వినియోగించు కోవచ్చుననే నైజం ప్రబలి పోయింది. కాదేదీ బాలకార్మిక వ్యవస్థకు అనర్హం అన్న రీతిలో అందుగలడిందులేడను సందేహము లేదన్నట్లుగా ఎక్కడ చూసినా బాలకార్మిక వ్యవస్థ వేళ్ళూనుకుని పోయింది. వీధి బాలలుగా, భిక్షగాళ్ళలా, అసాంఘిక కార్యకలాపాలకు ఆలవాలంగా మారిన బాలల జీవితాలలో వెలుగు రేఖలు పూయించే నూతన చట్టాలు రావాలి. ఆ చట్టాల అమలు కట్టుదిట్టం చేయాలి. తల్లిదండ్రుల దృక్పథంలో కూడా మార్పు రావాలి. బాలల హక్కులను కాలరాసే మనస్తత్వాలు మారాలి. బాలలను బడిబాట వైపు మళ్ళించే కార్యక్రమాలు విరివిగా చేపట్టాలి. ఎప్పుడైతే బాలలంతా చదువుకుని విద్యా బుద్ధులతో వికసిస్తారో, ఎప్పుడైతే పాఠశాలల్లో బాలల శక్తి సానబెట్టబడి నిక్కమైన నీలవన్నెలతో తేజోమయమౌతుందో ఆనాడే బాలభారతం వికసిస్తుంది. బావిభారతం సుసంపన్నమై సుందర నందనోద్యానవన మౌతుంది. ఆ రోజు కోసం నిరీక్షిద్దాం, దేశస్వప్నాలను సాకారమయ్యేదిశగా మార్గదర్శకత్వం వహిద్దాం. బాల కార్మిక వ్యవస్థకు మూలకారణం ఆర్థిక పరిస్థితులు. కుటుంబాల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచి, బాలలకు సరైన విద్యావకాశాలు కల్పించి, బాలకార్మిక వ్యవస్థను సమూల ప్రక్షాళన చేయాలి. ఎక్కడైతే బాల్యం ఆరోగ్యంతో, ఆటపాటలతో, విద్యతో వికసిస్తుందో అక్కడే అభివృద్ధికి బీజం పడుతుంది.బాల్యం చుట్టూ కమ్ముకుంటున్న కారు చీకట్లను తొలగించాలి. బాలలను పాఠశాలలకు పంపించి, మనో వికాసం కలిగించి, విద్యాబుద్ధులు నేర్పించాలి.

**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463

# భద్రత కరువైన బాల్యం



నేటి బాలలే రేపటి పౌరులు బాలలు మన జాతీయ సంపద. భవిష్యత్తు మానవ వనరులు. బాలలు భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థలో జాతీయ ఉత్పత్తిని పెంచడానికి దోహదపడే ఉత్పాదక శక్తి. జాతీయాదాయ అభివృద్ధిలో బహుముఖపాత్ర పోషించే బాలలు భవిష్యత్ దేదాభివృద్ధికి దశ దిశను నిర్ణయించే శక్తి అనడంలో అతిశయోక్తి లేదు. ఆడుతూ పాడుతూ హాయిగా జీవితం గడిపే బాల్యదశ పలు సమస్యలకు నిలయమైంది. బాలల హక్కులు స్వేచ్ఛను హరించే బాల కార్మిక వ్యవస్థ దురాచారాన్ని రుపుమాపడానికి 2002 నుండి ఐక్యరాజ్యసమితి, యునిసెఫ్,ఐ,ఎల్,ఓ సంయుక్తంగా 12 జూన్ ప్రపంచ బా కార్మిక వ్యవస్థ వ్యతిరేకదినోత్సవాన్ని పాటిస్తారు. ఐక్యరాజ్యసమితి రూపొందించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా 2025 నాటికి బాల కార్మిక వ్యవస్థను అంతం చెయ్యాలని లక్ష్యంగా నిర్ణయించారు. 2023 నినాదం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం నినాదం 'వీక్ ఆఫ్ ఆక్షన్ ఎగైనెస్ట్ చైల్డ్ లేబర్' బాల కార్మిక వ్యవస్థను అంతం చెయ్యాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగింది.

ప్రపంచీకరణ, కార్పోటీకరణ,ప్రైవేటీకరణ, సాంకేతిక ప్రగతి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో చోటు చేసుకున్న పరిణామాలు ప్రభుత్వరంగంలో మార్పులు ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు ఉపసంహరణ బాలకార్మిక సమస్య ఉధ్రుతికి ఆజ్యం పోశాయి.

బాలకార్మిక వ్యవస్థ విశ్వ వ్యాప్తమైంది. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సామాజిక, ఆర్థిక సమస్యల్లో బాల కార్మిక వ్యవస్థ ప్రధానమైంది. అమలుకు నోచుకోని చట్టాలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకై చట్టాలున్నప్పటికీ అమలుకు నోచుకోకపోవడం వల్ల బాల కార్మికుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. బాలల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలకు ఐక్యరాజ్యసమితి హెచ్చరికలు ఆదేశాలు జారీచేస్తూ బాలకార్మిక వ్యవస్థనిర్మూలన కొరకు 'యునెస్కో'అంతర్జాతీయ సమాజం కృషి చేసినప్పటికి పూర్తి స్థాయిలో ఆశించిన ఫలితాలు రావడంలేదు. బాల కార్మికులు పరిశ్రమలు,తయారీ,మైనింగ్, బాణా సంచా తయారీ ఫ్యాక్టరీలలో,హోటళ్ళలో నిర్మాణ రంగం, సేవారంగాలలో, బిక్షాటనలో ప్రైవేట్ అసంఘటిత రంగంలో బాల కార్మికులు ఎక్కువ సంఖ్యలో అల్ప వేతనాలనకు పని చేస్తున్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు బాల కార్మికుల శ్రమ దోపిడి చేస్తున్నాయి. ఆర్థికవ్యవస్థలో పేరుకుపోయిన పేదరికం,నిరుద్యోగం,నిరక్షరాస్యత చట్టాలపై పరిజ్ఞానం లేకపోవడంవల్ల బాల కార్మికులు పెరిగిపోతున్నారు. కనీస అవసరాలు లేక దారిద్ర్యరేఖ కింద జీవిస్తున్న పేదలు,బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అల్ప ఆదాయాలు, అల్పకొనుగోలు శక్తి వల్ల అనేక కుటుంబాలు తమ పిల్లలను బడిలో కాకుండా పనుల్లో చేర్చుతున్నారని పలు అధ్యయనాలు తెలుపు తున్నాయి.



రాజ్యాంగంలో పేర్కొన్న 'ఉచితవిద్య' అందని ద్రాక్ష అయ్యింది. ప్రభుత్వం విద్యారంగం నుండి తప్పుకొని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించడం వల్ల పేద వర్గాలకు'విద్యమిథ్య' గా మారింది. దేశంలో నెలకొన్న సామాజిక'ఆర్థిక రాజకీయ,సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు ప్రభుత్వాలు అవలంబిస్తున్న అశాస్త్రీయ సమగ్ర విద్యా పాలన విధానాలు నిర్లక్ష్యం ఉదాసీనత, బాలల విద్యకు ఆటంకంగా పరిణమించాయి. ఇంకా కొంత మంది పిల్లలు వంశ పారంపర్యంగా వస్తున్న కులవృతుల్లో వృత్తుల్లో పని చేస్తున్నారు.

ఐఎల్ఓ అంచనాలప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 15.2 కోట్ల మంది బాలకార్మికులు ఉండగా అందులో 7.2 కోట్ల పిల్లలు ప్రమాదకరమైన పనుల్లో పనిచేస్తున్నారు. బాలకార్మిక వ్యవస్థపై ఉన్న నిషేధాన్ని ఎత్తి వేయాలనే వాదన బలపడుతుంది. ఫలితంగా ప్రపంచ దేశాలు బాలకార్మిక వ్యతిరేక చట్టాలను నీరుగార్చే ప్రమాదం పొంచివుందనే హెచ్చరికలు చోటుచేసుకోవడం శోచనీయం. ఈసమయంలో మనం సరైన నిర్ణయం తీసుకోకపోతే ఓ తరాన్ని కోల్పోయే ప్రమాదం వుంది. 2000 నుండి 2016 మధ్య ప్రపంచ వ్యాప్తంగా బాలకార్మికుల సంఖ్య 38 శాతం తగ్గింది. బాలకార్మికులు జీవితాలు సమస్యల వలయంగా మారాయి. కనీసం ప్రాథమిక విద్య, వైద్యానికి నోచుకోవడం లేదు. పోషకాహార లోపం వల్ల శారీరక ఎదుగుదల సరిగా ఉండడంలేదు. అనేక మానసిక ఆరోగ్యసమస్యలను ఎదురుకొంటున్నారు.

ప్రమాదకర పరిస్థితుల్లో సైతం పనిచేస్తూ. బాలకార్మికులు భౌతిక,లైంగిక దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. పోటీ తత్వం రాజ్య మేలుతున్న సమాజంలో బాలలు అన్ని రకాలుగా వెనకబడి పడిపోతున్నారు. బాలకార్మికులు ఎక్కువ పని గంటలు తక్కువ వేతనాలు పొందుతూ శ్రమ దోపిడీకి గురి అవుతున్నారు. అక్రమ రవాణా, వేశ్యావృతి, డ్రగ్ మాఫియాకు బలవు తున్నారు. నేరప్రవృత్తి పెరిగి హింసాత్మక ఘటన లకు పాలుపడే ప్రమాదం వుంది. ఫలితంగా వారి బంగారు భవిష్యత్తు అంధకారంగా మారుతుందని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఉపాధి ఉద్యోగ మార్గాలు వెతుక్కునేందుకు సరైన మార్గదర్శనం లేకపోవడం ఆర్థిక తోడ్పాటు లేకపోవడం నైపుణ్య లేమి వంటి కారణాల వల్ల బాలలు కార్మికులుగా మారుతున్నారు. బాలకార్మిక వ్యవస్థనిర్మూలన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బహుముఖ చర్యలు చేపట్టాలి. దేశంసంపదైన బాలలు బాల కార్మిక వ్యవస్థలో మగ్గిపోతే దేశ భవిష్యత్తు అంధకారమౌతుంది. బాలలకు తగిన విద్య శిక్షణ అందించి విలువైన నిపుణతగల మానవ వనరులుగా తీర్చిదిద్దాలి. ఉపాధి హామీ పథకం,సాంకేతిక నైపుణ్య అభివృద్ధి, సహకార సంఘాలు సాంఘిక భద్రత పథకాల అమలు చెయ్యాలి. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకు ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు సామాజిక సంస్థలు 'కమ్యూనిటీ కౌన్సిలింగ్' వ్యవస్థను సమర్థవంతంగా అమలు చెయ్యాలి. బాలకార్మికులు కొరకు ప్రతేక పాఠశాలలు నెలకొల్పాలి. బాలలకు పౌష్ఠిక ఆహారం అందించాలి. తల్లితండ్రుల సంరక్షణ లేని అనాథ బాలల కొరకు ప్రత్యేక రక్షణ సంరక్షణ సౌకర్యాలు వసతి కలిపించాలి. అంతర్జాతీయ బాలల హక్కుల కోసం కృషి చేస్తున్న యునెస్కో వివిధ దేశాలలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టాలు రూపొందించి 15 యేళ్ల లోపు పిల్లలను ఎక్కడ పనుల్లో చేర్చకోరాదని 18 యేళ్ల లోపు వారిని కఠినమైన పనులకు ఉపయోగించరాదు అని నిబంధనలు సభ్య దేశాలప్రభుత్వాలుఅమలు చెయ్యాలని ఆదేశించడం గమనార్హం.

2025నాటికి బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని సుస్థిరాభివృద్ధి లక్ష్యాలల్లో నిర్దేశించారు. ఈదిశగా ప్రపంచ దేశాలు కృషి చెయ్యాలని బాలల హక్కుల రక్షణ పర్యవేక్షణకు పనిచేస్తున్న పలు సంస్థలు ప్రభుత్వాలకు సూచించడం గమనార్హం. బాలలను హింస, దోపిడీ, దుర్వినియోగం నుండి రక్షించాలి. బాలల సంక్షేమమే లక్ష్యంగా బాలల బంగారు భవిష్యత్తుకు దీర్ఘకాలిక అభివృద్ధి వ్యూహంతో బాల కార్మిక రహిత భారత్ నిర్మాణానికి పాటు పడటం ప్రభుత్వం కృషి చెయ్యాలి. బాధ్యత. బాలల్ని శారీరక మానసిక సాంఘిక మానవీయ కోణంలో ఎదిగేలా పటిష్ట చర్యలు చేపట్టాలి. నేటి బాలలు రేపటి పౌరులు అన్నది నినాదం కాకుండా ప్రభుత్వాల విధానం కావాలి.

**- నేదునూరి కనకయ్య**
9440245771

# రేపటి ప్రపంచం వైపు!





తల్లిదండ్రుల ఆశలు... ఉపాధ్యాయుల అండతో పిల్లల అభివృద్ధి ప్రారంభం. వేసవి సెలవులు విద్యార్థుల జీవితంలో ఎంతో మధురమైన మరియు స్వేచ్ఛతో కూడిన కాలం. స్కూల్, హోమ్ వర్క్, పరీక్షల ఒత్తిడి లేకుండా తమకు ఇష్టమైన పనులు చేసుకునే, కుటుంబ సభ్యులతో సమయం గడిపే అవకాశాన్ని ఈ సెలవులు కల్పిస్తాయి. కానీ, ఈ సంతోషంగా గడిపిన కాలం ముగియగానే విద్యార్థుల్లో మళ్ళీ ఒక కొత్త ఒత్తిడి మొదలవుతుంది. అది స్కూల్ మళ్లీ ప్రారంభమవుతుందన్న ఆలోచనతో వచ్చే మానసిక స్థితి. పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతుండటంతో పిల్లల్లో మళ్లీ షెడ్యూల్‌కు సరిపడే జీవనశైలి తీసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఉదయం పూట త్వరగా లేచే అలవాటు, హోం వర్క్, టైమ్ టేబుల్, యూనిఫామ్, స్కూల్ బస్ ఇవన్నీ మళ్లీ జీవితంలోకి వస్తాయి. ఈ మార్పు కొంతమందికి ఆనందకరంగా ఉంటే, మరికొందరికి ఒత్తిడిగా అనిపించవచ్చు.

తల్లిదండ్రులు పిల్లల విషయంలో అనవసరంగా ఆందోళనకు గురి కావద్దు. పిల్లల్ని ఇబ్బందులకు గురి చేయవద్దు. పాఠశాల విద్యా విధానానికి అలవాటు పడేందుకు తగిన ప్రోత్సాహాన్ని, చదువు పట్ల ఆసక్తిని పెంపొందించే ప్రయత్నం చేయాలి. కొంతమంది విద్యార్థులు స్కూల్ మిత్రులను కలుసుకునే ఉత్సాహంతో, కొత్త విషయాలు నేర్చుకునే ఆసక్తితో ముందుకు వస్తారు. కొన్ని నెలల విరామం తర్వాత మళ్లీ తరగతిలో కూర్చోవడంపై కొందరు పిల్లలు ఆందోళనకు లోనవుతారు. ముఖ్యంగా చిన్నారుల్లో మళ్ళీ ఇల్లును వదిలి పెట్టే బాధ ఎక్కువగా కనిపిస్తుంది. సెలవుల్లో పూర్తిగా ఆటలు, టీవీ, ఫోన్లలో మునిగిపోయిన పిల్లలు మళ్లీ చదువు పై దృష్టి పెట్టడం కష్టం అనిపించవచ్చు. కొత్త తరగతికి వెళ్లడం, కొత్త గురువులు, కొత్త సబ్జెక్టులు ఇవన్నీ కొంత ఒత్తిడిని కలిగించ వచ్చు. ముఖ్యంగా ఐ. క్యూ. ఆత్మవిశ్వాసం తక్కువగా ఉన్న విద్యార్థులకు ఇది దుఃఖం కలిగిన అనుభవంగా మారవచ్చు.

**తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీసుకోవలసిన చర్యలు**

స్కూల్ పట్ల పిల్లల్లో ఆనందం కలిగించేలా చెప్పాలి. భయపెట్టే భాష వాడకూడదు ఉదా: స్కూల్ కు వెళ్లక పోతే సర్ కొడతారు అని అనకూడదు. మొదటి వారంలో చాలా హోం వర్క్, ఒత్తిడినిచ్చే పనులు ఇవ్వకుండా చిన్న చిన్న టాస్కలతో విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దాలి. నువ్వు స్కూల్‌కు వెళ్ళడం ఎంతో గొప్ప విషయం, నీకిప్పుడు కొత్తగా చాలా నేర్చుకోవచ్చు అంటూ చెప్పాలి.

పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులను కఠినంగా కాకుండా ఆత్మీయతతో దగ్గరకు తీసుకోవాలి. పిల్లల్లో బలమైన సంబంధాలను ఏర్పాటు ప్రయత్నం చేయాలి. స్కూల్ పునఃప్రారంభమైన తర్వాత చిన్న చిన్న విరామాలు, ఆటల సమయం, కళలతో కూడిన పాఠాలు చెప్పడం చాలా అవసరం.

వేసవి సెలవుల అనంతరం విద్యార్థుల్లో వచ్చే మానసిక మార్పులు సహజం. కానీ వాటిని పట్టించుకోకుండా వదిలేస్తే, అది వారి విద్యా ప్రగతిపై ప్రభావం చూపుతుంది. అందువల్ల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో ముందుకు వెళ్తే, పిల్లలు సులభంగా మళ్లీ పాఠశాల జీవితం వైపు అడుగులు వేస్తారు. ఈ దశలో వారి అవసరాలను అర్థం చేసుకొని సానుకూల వాతావరణాన్ని అందించడం ద్వారా వారు ఆత్మవిశ్వాసంతో ఎదగ గలుగుతారు. పిల్లలు స్కూల్‌కి సుముఖతతో వెళ్లాలంటే, వారికి భయాలు లేకుండా సహాయకరమైన వాతావరణం కల్పించాలి. తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు కలిసి పనిచేస్తే, పిల్లలు సులభంగా స్కూల్ జీవితంలోకి సర్దుబాటు చేసుకుంటారు. చిన్నారుల అభివృద్ధికి తల్లిదండ్రుల సహాయం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఉండాలి. ఇదే విజయానికి మూలం!

**- డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి**
9703935321

# అట్రాసిటీ, పెండింగ్ కేసులు, భూ సమస్యలను నెలలోగా పరిష్కరించాలి

- ఎస్సీ, ఎస్టీ వారికి అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ లలో అవకాశం కల్పించాలి
- ప్రతి నెల చివరి రోజున పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మహబూబ్ నగర్, జూన్ 12(మనం బ్యూరో): జిల్లాలో ఎస్సి, ఎస్టి అట్రాసిటీ భాదితులకి సత్వర న్యాయం జరిగేలా చూడాలని, ఎస్.సి, ఎస్.టి అట్రాసిటీ పెండింగ్ కేసులు జులై 12 లోగా పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్ సి,ఎస్ టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్సి, ఎస్టి అత్యాచార కేసులు, భూ సమస్యలు, వివిధ శాఖల ద్వారా ఎస్.సి.,ఎస్. టి లకుసంక్షేమ పథకాల అమలు పై తెలంగాణ రాష్ట్ర ఎస్ సి, ఎస్ టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,కమిషన్ సభ్యులు నీలాదేవి, శంకర్, రాంబాబు నాయక్, లక్ష్మి నారాయణలతో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎస్.సి, ఎస్.టి.లకు సంబంధించిన భూ సమస్యలు కూడా నెల రోజుల్లోగా జూలై 12 నాటికి భూ భారతి నూతన చట్టం ద్వారా పరిష్కారం చేయాలని సూచించారు ధరణి ద్వారా పరిష్కారం కాని వాటిని భూ భారతి నూతన చట్టం ద్వారా ఎస్.సి.లు,ఎస్.టి. ల భూ సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు. పోలీస్ శాఖ ద్వారా నమోదు అయిన ఎస్.సి.,ఎస్ టి కేసులు గురించి ఎస్.పి.డి.జానకి వివరించారు. ఈ సంవత్సరం 26 కేసులు నమోదు కాగా 6 ఛార్జీ షీట్ చేసినట్లు,20 కేసులు విచారణలో ఉన్నట్లు తెలిపారు.గత సంవత్సరం 78 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 2014 సంవత్సరం నుండి 2023 వరకు 530 కేసులకు గాను 90 కేసులు ఛార్జిషీట్ వేయలేదు కారణాలు అడిగి తెలుసుకున్నారు. 2023-24 సంవత్సరం 27 అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు పరిహారం చెల్లించినట్లు అధికారులు వివరించారు ఈ సంవత్సరం 71 మందికి 78 లక్షలు పరిహారం చెల్లింపుకు నిధులు రావలసి ఉందని తెలిపారు. సంబంధిత శాఖ రాష్ట్ర అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రితో మాట్లాడి నిధులు విడుదల చేస్తానని చైర్మన్ తెలిపారు. అంబేద్కర్ విదేశీ విద్యా నిధి కింద గత సంవత్సరం ఒక అమ్మాయికి 20 లక్షలు విదేశాల్లో చదువు కునేందుకు మంజూరు చేసినట్లు ఎస్.సి.అభివృద్ధి అధికారి తెలిపారు. జిల్లాలో ఎస్.సి.ఎస్.టి జనాభా ఎక్కువ గా ఉందని, సుమారు 23 శాతం ఉన్నారని,ఎక్కువ సంఖ్యలో వారికి లబ్ది జరిగేలా చూడాలని అన్నారు.ప్రతి మూడు నెలల కొకసారి ఎస్.సి, ఎస్.టి అట్రాసిటీస్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిపి సమీక్షించాలని అన్నారు.ఎస్.సి.,ఎస్ టి సబ్ ప్లాన్ నిధులు పక్క దారి పట్టించ వద్దని తెలిపారు. ఆర్బి, పంచాయతీ రాజ్ కాంట్రాక్టర్ లకు ఇచ్చే పనుల్లో ఎస్ సి, ఎస్టిలకు వారి స్థోమత ను బట్టి చిన్న చిన్న పనులు కేటాయించాలని చైర్మన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్.సి, గురుకులాలు, ఎస్.టి గురుకులాలు సంఖ్య, విద్యార్థుల సంఖ్య, పక్కా భవనాలు ఉన్నాయి. అద్దెకు ఉన్నవి నిర్మాణం లో ఉన్న వాటి గురించి తెలుసుకున్నారు.జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సందర్శించి బ్యాంక్ ద్వారా అందించిన రుణాలు,ఎస్.సి.,ఎస్.టి.లకు ఎంత మందికి రుణం అందించారు వివరాలు బ్యాంక్ ఏ.జి.ఎం. రమేష్ వివరించారు.ఎస్.సి.,ఎస్. టి ఉద్యోగుల వివరాలు తెలుసుకున్నారు.ఎస్.సి.,ఎస్.టి.లకు రిజర్వేషన్ శాతం పాటించాలని అన్నారు.జడ్చర్ల బాదేపల్లి జడ్.పి.బాలుర ఉన్నత పాఠశాలను కమిషన్ చైర్మన్,సభ్యులు సందర్శించారు. గురువారం పాఠశాలలు ప్రారంభం కావటంతో విద్యార్థిని, విద్యార్థులకు చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు స్కూల్ యూనిఫామ్, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. 500 కంటే పదవ తరగతి పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన 16 మంది విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అంద చేశారు.ఈ కార్యక్రమం లో జిల్లా విద్యా శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, జిల్లా ఎస్. సి.అభివృద్ధి అధికారి సుదర్శన్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్, ఎం. ఈ. ఓ మంజుల,తహాశీల్దార్ నర్సింగ రావు, ఏ.ఎం. ఓ దుంకుడు శ్రీనివాస్,పాఠశాల హెచ్.ఎం.చంద్ర కళ తదితరులు పాల్గొన్నారు

## ఆలయ నిర్మాణానికి భారీ విరాళం



- దాతలకు ఆలయ కమిటీ సన్మానం

చేవెళ్ల , జూన్ 12 (మనం న్యూస్): దాతల సహకారంతో గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తంగడపల్లి గ్రామ మాజీ సర్పంచ్ అనూష సత్తయ్య గౌడ్ తెలిపారు. మండల పరిధిలోని తంగడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయం అభివృద్ధికి గురువారం దేవుని ఎర్రవల్లి గ్రామని చెందిన సామ రంగారెడ్డి ఆలయ నిర్మా ణంలో భాగస్వాములై తమ వంతు సహకారంగా రూ. 50 వేలు ఆ గ్రామ మాజీ సర్పంచ్ అనూష సత్తయ్య గౌడ్ సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అనూష సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ..నూతనంగా నిర్మిస్తు న్న హనుమాన్ ఆలయ అభివృద్ధికి మరింత మంది దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలోని రాములు గౌడ్,గోపాల్ రెడ్డి,రవీందర్ గౌడ్, పాల్గొన్నారు.

## ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్ల, జూన్ 12(మనం న్యూస్): విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. తెలంగాణ మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో అమెజాన్ వారి సహకారంతో నూతనంగా నిర్మించిన మౌలిక వసతులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో జీవితాలను మార్చేది చదువేనని, చదువు చాలా గొప్పదన్నారు. దానికి కులం, మతం, జాతి అనే తేడాలు ఉండవని విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా మండలంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పిఏసిఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సున్నపు వసంతం, మాజీ ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డి, మాజీ జెడ్పీటిసి మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, మండల విద్యాధికారి ఎల్.పురం దాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసి గుండాల రాములు, మాజీ సర్పంచ్ జహంగీర్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు, అమెజాన్ కంపెనీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్‌పోర్టులో రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు



- జిల్లా కలెక్టర్ సత్య శారద

వరంగల్, జూన్ 12 (మనం ప్రతినిధి): మామునూరు విమానాశ్రయంలో రోడ్ల ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులతో కలసి మామునూరు విమానాశ్రయంలో రోడ్ల నిర్మాణం చేసే ప్రదేశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు పల్లి నుండి నేషనల్ హైవే వరకు, నక్కలపల్లి నుండి గాడిపల్లి - గాడిపల్లి బైపాస్ వరకు ఏర్పాటు చేయనున్న తదితర రోడ్ల స్థలాలను పరిశీలించి ప్రభుత్వానికి పంపడానికి త్వరితంగా ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రోడ్ల భవనాల శాఖ అధికారి రమేష్, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, ఇరిగేషన్ డి ఈ మధుసూదన్, తహసిల్దార్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బాగా చదవి మంచి పేరు తేవాలి



రంగారెడ్డి, జూన్ 12(మనం న్యూస్): పాఠశాల ప్రారంభమైన రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఉచిత యూనిఫామ్‌లు అందివ్వాలని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రాథమిక పాఠశాల జిల్లెలగూడలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కార్పొరేటర్ గజ్జల రామ్ చందర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలను అందుకోవాలని పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఏఏపీసీ చైర్మన్ శోభారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



పెద్దపల్లి, జూన్ 12 (మనం ప్రతినిధి): గురువారం పెద్దపల్లి జిల్లా గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కలెక్టర్ తనిఖీ సమయంలో గ్రంథాలయంలో ఉన్న పాఠకులతో గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న అన్ని సదుపాయాల గురించి కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేని పక్షంలో వివరాలు అందించాలని, వెంటనే వాటిని తెప్పించి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని, గ్రంథాలయానికి వచ్చే పాఠకుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు.

గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ పరీక్షలలో మంచి ఫలితాలు వచ్చేలా బాగా చదువుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కి భారతరత్న అందించాలి: వద్దిరాజు



వరంగల్, జూన్ 12(మనం ప్రతినిధి): కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్ట్ నిర్మించి బీడు వారిన రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును భారతరత్న పురస్కారంతో గౌరవించాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు భిన్నంగా కాంగ్రెస్ పాలకులు కమిషన్ ఏర్పాటు చేసి కేసీఆర్ ను విచారించడం అక్రమం, అన్యాయం, తీవ్ర అభ్యంతరకరమన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ రికార్డ్ సమయంలో నాలుగేళ్లలోనే పూర్తి చేయించి 2కోట్ల 42లక్షల ఎకరాలకు సమృద్ధిగా నీళ్లిచ్చి చెరువులు, కుంటలు నింపి, భూగర్భ జలమట్టాలను బాగా పెంచి రాష్ట్రాన్ని ఆకుపచ్చగా తీర్చిదిద్దారని ఎంపీ రవిచంద్ర వివరించారు. సమైక్య రాష్ట్రంలో దండుగ అనుకున్న వ్యవసాయాన్ని తెలంగాణ సాధించాక కేసీఆర్ ఆచరణలో పండుగ చేసి నిరూపించారని ఎంపీ వద్దిరాజు తెలిపారు. రైతు బంధు పథకాన్ని తీసుకొచ్చి, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రైతుల కష్టాలను కడతేర్చి దేశానికి ఆదర్శంగా నిలిచిన కేసీఆర్ ను భారతరత్న పురస్కారంతో గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా కర్ణాటక లోని రాయచూరులో గురువారం జరిగిన ముగింపు ఉత్సవాలకు ఎంపీ రవిచంద్ర తన సన్నిహితులు సీ.విఠల్, సర్దార్ పుటం పురుషోత్తమ రావు, రౌతు కనకయ్య, ఆకుల రజిత్ కుమార్,మరికల్ పోత సుధీర్ కుమార్,ఊసా రఘు,దివి రాంకుమార్ తదితర ప్రముఖులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాయచూరు మున్నూరుకాపు సమాజం అధ్యక్షులు బెల్లం నర్సారెడ్డి, ముంగారు సాంస్కృతిక రాయచూరు అధ్యక్షులు , మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డిల ఆధ్వర్యాన నాలుగు రోజుల పాటు ఈ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఎంపీ రవిచంద్ర, ఆయన సన్నిహితులు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేసి ఎడ్ల పందేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, కాపులం అంటే కష్ట జీవులమని, రైతు బిడ్డలమని, అన్నదాతలమని చెప్పారు. మున్నూరు కాపు, బలిజ, కాపు, తెలగ, తూర్పు కాపు, ఒంటరి అనే వేర్వేరు పేర్లతో పిలువబడుతున్న మనమందరం అన్నదమ్ముల పిల్లలమేనని పేర్కొన్నారు. మనం దేశంలో గణనీయమైన సంఖ్యలో ఉన్నామని, వచ్చే ఏడాది జరిగే జన గణన-కుల గణన సందర్భంగా మున్నూరు కాపు అని తప్పనిసరిగా నమోదు చేసుకుందామన్నారు. మన పిల్లల్ని విద్యావంతులుగా తీర్చిదిద్దుకుంటూ వ్యాపార, రాజకీయ రంగాలలో కూడా ముందడుగు వేయాల్సిన అవసరం ఉందని ఎంపీ రవిచంద్ర చెప్పారు. మున్నూరు కాపులం ఇతర బీసీ కులాల వారితో స్నేహంగా ఉంటూ,పరస్పర సహకారంతో రాజ్యాధికారం దిశగా వడివడిగా అడుగులేద్దామని ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో శాంతిభద్రతలు సజావుగా ఉండడం, సరళీకరణ విధానాలతో పెట్టుబడులు తరలివచ్చి హైదరాబాద్ గొప్పగా అభివృద్ధి చెందిందని తెలిపారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా 25 ఏండ్ల నుంచి ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్న పాపారెడ్డికి తెలంగాణ మున్నూరుకాపు సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని, ఇదే విధంగా మరో 25 సంవత్సరాలు జరుపుతూ నిండూ నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఎంపీ వద్దిరాజు ఆకాంక్షించారు. పాపారెడ్డి, నర్సారెడ్డిలు రవిచంద్ర, విఠల్, పురుషోత్తమ రావు,కనకయ్య,రజిత్ కుమార్,సుధీర్ కుమార్, రఘు, రాంకుమార్, డాక్టర్ పీఎల్ఎన్ పటేల్,భేతి శ్రీధర్,కొట్టే వెంకట నారాయణ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## పునః ప్రారంభమైన అంధుల ప్రాథమిక పాఠశాల



రంగారెడ్డి, జూన్ 12(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో గురువారం నుండి బడులు పునప్రారంభం అయ్యా యి. అందులో భాగంగా పాత బస్తీ లోని అంధుల ప్రాథమిక పాఠశాలను హైదరాబాద్ డిఈఓ రోహిణి సందర్శించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఇక్కడ అన్ని వసతులు అధునాతనమైన కంప్యూటర్ ల్యాబ్ ఏఐ టెక్నాలజీ సకల సౌకర్యాలతో హాస్టల్ వసతి ఉన్నాయని పిల్లలు చక్కగా చదువుకొని అన్ని రంగాలలో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



తుర్క యంజాల్ జూన్ 12( మనం న్యూస్): తుర్క యంజాల్ మున్సిపాలిటీ పరిధి ఇంజాపూర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్లో గురువారం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వచ్చేసి పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు బాల్యం నుండి క్రమ శిక్షణతో, శ్రద్ధతో చదువుకోవాలని, అదే విధంగా చదువుతో పాటు ఆట పాటలతో ఉత్సాహంగా ఆడుకోవాలని, మున్సిపాలిటీలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ప్రోత్సహించాలని, నేడు విద్యా వైద్యం ఖర్చులు పెరిగి మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం పాఠశాలలో ఎటువంటి ఫీజుల సమస్యలు లేకుండా ఉత్తీర్ణత కలిగిన ఉపాధ్యాయులు బోధన అందిస్తున్నారని, పేద మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహాయం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధమేనని తెలిపారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి.మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డి, మాజీ వైస్ చైర్ పర్సన్ గుండ్ల పల్లి హరిత ధనరాజ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొక్క వంశీధర్ రెడ్డి, ఎండి గౌస్ పాషా, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆరో శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్ వినయ్, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్‌నెస్ లేని కళాశాల బస్సులను సీజ్ చేయాలి

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి. శివ కుమార్ గౌడ్



తుర్క యంజాల్, జూన్12( మనం న్యూస్): అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఫిట్నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని రీజినల్ ట్రాన్స్పోర్ట్ అధికారి సుభాష్ చంద్ర రెడ్డి గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.శివ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న తరుణంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంగా వందల సంఖ్యలో ప్రైవేటు, కార్పోరేటర్ పాఠశాలలు కాలేజీలు ఉన్నాయని, విద్యా సంస్థల యాజమాన్యాలు తమ బస్సులను కచ్చితంగా ఫిట్నెస్ చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అన్నారు. అంతే కాకుండా బస్సుల్లో ఫైర్ సేఫ్టీ, ప్రైమరీ హెల్త్ చెకప్ (పీహెచ్ సి) కిట్ లు అందుబాటులో ఉంచాలి. కానీ కార్పొరేట్ యాజమాన్యాలు ఇవి ఏమీ పట్టించుకోకుండా యదేచ్ఛగా రోడ్లపైకి వస్తున్నాయనీ వారు తెలిపారు. 15 సంవత్సరాలకు పైబడిన బస్సులు కూడా ఏలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్నాయని వారు అన్నారు. డ్రైవర్లకు బస్సు నిర్వహణ పైన అవగాహన కల్పించాలి అదేవిధంగా వాహన వేగ పరిమితీని కూడా తగ్గించి నడిపే విధంగా చూడాలని వారు అన్నారు. పరిమితికి మించి బస్సులో విద్యార్థులను తరలించ వద్దని, విద్యార్థుల సంరక్షణ అందరీ బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. మోటార్ వెహికల్ ఆక్ట్ ప్రకారం నియమ నిబంధనలు పాటించని అన్ని ప్రైవేటు కార్పొరేట్ పాఠశాల కళాశాలల బస్సులను వెంటనే సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఏఐవైఎఫ్ నాయకులు గోవర్ధన్, వివేక్, గండికోట శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## హయత్ నగర్ డివిజన్‌లో మధు యాష్కీ పర్యటన



రంగారెడ్డి, జూన్ 12(మనం న్యూస్): టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ హయత్ నగర్ డివిజన్లో పర్యటించారు. హయత్నగర్ పాత గ్రామంలోని పార్కును పరిశీలించారు. పీర్ల కొట్టం స్థలాన్ని పరిశీలించిన ముస్లిం సోదరుల కోరిక మేరకు వెంటనే రేకులతో షెడ్డు నిర్మిస్తామని పేర్కొన్నారు. హయత్ నగర్ కుమ్మరి కుంట, బాతుల చెరువులను పరిశీలించారు. చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంటుండడంతో వేసవికాలంలో బోర్లు కూడా పనిచేయడం లేదని స్థానికులు వివరించారు. ఈ సందర్భంగా మధు యాష్కీ మాట్లాడుతూ బాతుల చెరువు కట్టను సుందరీకరణ చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణ కల్పించేందుకు అధికారులతో మాట్లాడుతానని పేర్కొన్నారు. కుమ్మరి కుంట చెరువు కట్టపై రహదారిని విస్తరించి అభివృద్ధి చేసేలా చర్యలు చేపడతామని వివరించారు. ఆ చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు పూడికతీయుట విషయంలోనూ చర్చించనున్నట్లు పేర్కొన్నారు. హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు చెన్న గోని రవీందర్ గౌడ్, మహిళా కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షురాలు కళ్లెం సుజాత రెడ్డి , కళ్లెం నరసింహారెడ్డి , పిడుగు సుభాష్ , పిడుగు శ్రీనివాస్, నీరిడు సహదేవ్ , ఆకిటి బాల్ రాజ్, దాసరి మోని శ్రీనివాస్, లింగం సందీప్, నాయకుడు దాము మహేందర్ యాదవ్, సల్మాన్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ ఇళ్ల పురోగతి పై పోచారం సమీక్ష

**కామారెడ్డి, జూన్ 12 ( మనంప్రతినిధి) :** కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణ కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని హైదరాబాద్ బంజారాహిల్స్ తన నివాసం నుండి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడ పట్టణ మున్సిపల్ కార్యాలయంలో ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీ హరి రాజు , అధికారులు, ప్రజాప్రతినిధులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో పోచారం మాట్లాడుతూ., బాన్సువాడ పట్టణ కేంద్రంలో మొదటి విడతగా 260 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, వార్డుల వారిగా ఏ వార్డుకి ఎన్ని మంజూరు అయ్యాయానేది ఇంచార్జ్ లకు తెలుసని, వార్డు ఇన్చార్జి సభ్యులు ప్రతి ఒక్కరూ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇల్లు నిర్మించుకోవడానికి ప్రోత్సహించాలని అన్నారు. ఇల్లు నిర్మాణం కోసం అవసరమయ్యే ఇసుక రాష్ట్రంలోనే బాన్సువాడ నియోజకవర్గంలో అతి తక్కువ ధరలో అందుబాటులో ఉండేలా ఏర్పాటుచేసామని అన్నారు.

నియోజవర్గంలోని బీర్కూర్, కిష్టాపూర్, చించోలి, దామరంచ ఈ నాలుగు క్వారీల నుండి ఇసుక అందుబాటులో ఉంది, ఒక ఇల్లు నిర్మాణానికి సుమారుగా 20 ట్రాక్టర్ల ఇసుక అవసరమవుతుందని అంచనా వేసామని, అందుకు సరిపడా 20 ట్రాక్టర్ల ఇసుకను వారి



సొంత స్థలంలో డంపు అయ్యేలా చూడాలని అన్నారు. లబ్ధిదారుల ఇండ్ల నిర్మాణం స్లాబ్ వరకు పూర్తవుతే నాలుగు లక్షల రూపాయలు లబ్ధిదారుల అకౌంట్లో జమవుతుందని వారికి అవగాహన కల్పించాలని సూచించారు. బెస్మిట్ లెవెల్ వరకు ఒక లక్ష, స్లాబ్ లెవెల్ వరకు ఒక లక్ష, స్లాబ్ వేశాక రెండు లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తి అయితే మిగతా లక్ష మొత్తం 5 లక్షలు విడతల వారిగా చెల్లించడం జరుగుతుందని తెలిపారు. స్వంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునేవారు యల్ 1 కేటగిరీ కిందికి వస్తారని, స్థలం లేని వారు యల్ 2 కేటగిరి కిందికి వస్తారని అన్నారు.

వార్డు ఇంచార్జి సభ్యులు వార్డులలో తిరుగుతున్నప్పుడు ఇళ్లు నిర్మించుకోవడానికి స్థలం లేని వారు మీ దగ్గరికి వచ్చి ఇల్లు కావాలి అని అడుగుతే వారి పూర్తి వివరాలు తీసుకొని వారికి ఎమ్మెల్యేకి మరియు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని వాళ్లకు చెప్పి వారి పూర్తి వివరాలు తనకి తెలియచేయండని అధికారులతో అన్నారు. ఇది వరకు బాన్సువాడలో 2500 డబల్ బెడ్ రూంలు నిర్మించి ఇచ్చామని, ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్ల ద్వారా స్థలం ఉన్న వారికి 260 ఇల్లు మంజూరు అయ్యాయని, స్థలం లేని యల్ 2 కేటగిరి వారి వివరాలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలో మంజూరు అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. తను రెండు మూడు రోజులలో బాన్సువాడకి వస్తానని, మీ పనితీరును స్వయంగా పర్యవేక్షిస్తానని అన్నారు. మరోసారి ప్రతి ఒక్క వార్డు ఇంచార్జి విధిగా లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి ఇంటి నిర్మాణంపై అవగాహన కల్పించాలని తెలియజేశారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా కృషి చేయాలి



**బాన్సువాడ, జూన్ 12 ( మనం న్యూస్) :** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏ ఎస్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యాల సంతోష్ పేర్కొన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని బాన్సువాడ పట్టణం, రాజారాం దుబ్బ లో గురువారం ఆయన పర్యటించారు. బాల కార్మికుల వల్ల చిన్నారుల తమ అమూల్యమైన బాల్యాన్ని కోల్పోవడంతో పాటు వారి భవితవ్యాన్ని కాల రాసిన వారం అవుతామని వారి తల్లిదండ్రులకు సూచించారు. చదువు యొక్క ప్రాముఖ్యతను వారికి వివరించారు. చదువు వల్ల గొప్ప స్థాయికి వెళ్లిన మహనీయుల జీవిత చరిత్రను వారికి తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరు పిల్లలను పాఠశాలకు పంపి విధంగా ప్రయత్నించాలని ఆయన కోరారు. ప్రభుత్వా పేద విద్యార్థుల కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తున్నందున వాటిని ఉపయోగించుకోవాలని అన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

- కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి, జూన్ 12 ( మనంప్రతినిధి) :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన గుణాత్మక విద్య అందిస్తున్నామని, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డి హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో జరిగిన పేరెంట్స్ మీటింగ్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ., ప్రభుత్వ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, మధ్యాహ్న భోజన పథకం, రెండు జతల యూనిఫారంలు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందిస్తున్నామని ఆయన తెలియజేశారు.

దాతల సహకారంతో పాఠశాలలో రంగులు వేయించడం పూర్తి చేయడం జరిగిందని, సామాజిక





అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు యూనిఫామ్స్ పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ రాజు, ప్రముఖ శాస్త్రవేత్త ఎల్లారెడ్డి ,మండల స్పెషల్ ఆఫీసర్, మండల విద్యాధికారి యోసేఫ్ , జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, వయోజన విద్య ప్రాజెక్ట్ అధికారి వెంకటేశ్వర రావు , గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. ఇదే గ్రామంలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు విద్యార్థులకు ఉచిత యూనిఫారం, పాఠ్య పుస్తకాలు మరియు నోటు పుస్తకాలు అందజేశారు.

# సాయుధ దళాల పతాక నిధికి మాజీ విద్యుత్ శాఖ ఉద్యోగి లక్ష విరాళం

**కామారెడ్డి, జూన్ 12 ( మనంప్రతినిధి) :** సాయుధ దళాల పతాక నిధికి విద్యుత్ శాఖ ఉద్యోగి (రిటైర్డ్) కె.క్రిష్ణ మూర్తి శర్మ (పంతులు) లక్ష రూపాయల విరాళం అందజేశారు. దేశ రక్షణ కోసం తమ జీవితాలను త్యాగం చేస్తూ తమ భార్య పిల్లలను ఇంటి దగ్గరేవుంచి ఎక్కడో దేశ సరిహద్దులలో భారత దేశ రక్షణ కొరకు, భారత ప్రజల సుఖశాంతుల కొరకు పనిచేస్తున్న భారత త్రివిధ దళాల సేవలు మరవలేనివని అన్నారు. అందుకే వారి సంక్షేమానికి భారత దేశ పౌరునిగా చేయూతనందిస్తూ వారికి సంఘీభావం తెలుపుతూ సాయుధ దళాల పతాక నిధికి లక్ష రూపాయల ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధికారిడి.రమేష్ కు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయనను శాలువతో సత్కరించారు. కె.క్రిష్ణ మూర్తి శర్మ (పంతులు) ని స్ఫూర్తిగా తీసుకొని కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుండి వ్యాపారస్తులు, ప్రజలు దేశ రక్షణలో విధులు



నిర్వహిస్తున్న సైనికులకు, వారి కుటుంబాలకి స్వచ్ఛందంగా విరాళాలను అందించి ఆదుకోవాలని కోరారు. దేశ రక్షణ కొరకు చేసిన త్యాగాలకన్న మించిన త్యాగం మరి ఏది లేదని కొనియాడినారు. ఈ సన్మాన కార్యక్రమములో ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి (పూ.అ.భ), డి.రమేష్, కార్యాలయ సిబ్బంది, బదాం గంగామోహన్, ఉమేర్ పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



- కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి, జూన్ 12 ( మనంప్రతినిధి): బాల కార్మిక సమస్యను సమూలంగా నిర్మూలించేందుకు మనమంతా కృషి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ సందర్భంగా మాట్లాడుతూ., పేద కుటుంబాల నుండి వచ్చే పిల్లలు విద్యను మధ్యలోనే వదిలి చిన్నతనంలోనే ఉద్యోగాలలో చేరుతుండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నిబంధనల 14 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలో ఉండాలని తెలిపారు. తల్లితండ్రులు పిల్లలను పని చేయమని పంపడం వలన వారి ఆరోగ్యం, భవిష్యత్తు నాశనం అవుతుందని పేర్కొన్నారు. బాల కార్మికులను గుర్తించే విషయంలో గ్రామ, వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బాధ్యతగా ఉండాలని చెప్పారు. 14 ఏళ్లు నిండిన వారు కూడా ప్రమాదకరమైన ఉద్యోగాలలో చేరరాదని హెచ్చరించారు. 18 ఏళ్లు నిండకముందే వారు బాగా శ్రమ పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రమీల, సూపరిండెంట్ విజయభాస్కర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కోటేశ్వర్లు, డిస్టిక్ చైల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ స్రవంతి, సాధన కోఆర్డినేటర్ గిరిజ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

**కామారెడ్డి, జూన్ 12 (మనంప్రతినిధి) :** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం రాజంపేట మండలం బస్వన్నపల్లి గ్రామానికి చెందిన సిద్ది రాములు (50) మనవడు శ్రేయాంక్ (04) వెళ్తున్న



వాహనాన్ని బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ బస్వన్నపల్లి గ్రామంలో గల సిద్ది రాములు, శ్రేయాంక్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చి, ఆర్థిక సహాయం అందిచడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ., ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవడం చాల బాధాకరం అని అన్నారు. చనిపోయిన వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వం తరపున నుండి పరిహారం అందేలా చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయం- అంతర్జాతీయం

# భారత్ టార్గెట్‌గా డ్రగ్స్ దందా

- 'ప్రాజెక్ట్ పెలికాన్'లో బయటపడిన వాస్తవాలు..!

**ఒట్టావా, జూన్ 12 :** కెనడాలో ప్రాజెక్ట్ పెలికాన్ పేరిట నిర్వహించిన ఆపరేషన్‌లో 479 కిలోల కొకైన్ స్వాధీనం చేసుకొన్నారు. దీనిని అమ్మగా వచ్చే డబ్బుతో ఖలిస్థానీ సానుభూతిపరులు భారత వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహించాలని ప్లాన్ చేసినట్లు చెప్పారు. భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు ఆజ్యం పోసేలా ఖలిస్థానీ సానుభూతిపరులు నిధుల సమీకరణకు కెనడాలో భారీ ఎత్తున డ్రగ్స్ దందాలు నిర్వహిస్తున్నారు. అక్కడి పీల్ రీజనల్ పోలీసులు ప్రాజెక్టు పెలికాన్ పేరిట నిర్వహించిన దర్యాప్తులో కీలక విషయాలు





బయటపడ్డాయి. ఈ ఆపరేషన్ సందర్భంగా 479 కిలోల కొకైన్ను స్వాధీనం చేసుకొన్నారు. దీని విలువ 47.9 మిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా. భారతీయ మూలాలున్న ఏడుగురు సహా మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేశారు. అమెరికా-కెనడా మధ్య ఉన్న వాణిజ్య ట్రక్కుల రవాణా మార్గాన్ని వాడుకొంటున్నట్లు గుర్తించారు. వీరికి మెక్సికన్ ముఠాలతో సన్నిహిత సంబంధాలున్నాయని పీల్ పోలీసులు వెల్లడించారు. ఈ మాదక ద్రవ్యాల అక్రమ వ్యాపారం నుంచి వచ్చే సొమ్మును భారత వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ఈక్రమంలో ఆందోళనలు, రెఫరండాల నిర్వహణ, ఆయుధాల కొనుగోళ్లు వంటి వాటికి పాల్పడుతున్నారు. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ మద్దతుతోనే ఈ ఖలిస్థానీ ముఠాలు మెక్సికన్ నుంచి వచ్చే విలువైన కొకైన్ ఎగుమతి చేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు అఫ్గానిస్థాన్ నుంచి వచ్చే హెరాయిన్ నుంచే ఐఎస్ఐ కార్య కలాపాలకు నిధులు సేకరిస్తోంది. తాజాగా అరెస్టయిన వారిలో యోగేంద్రరాజ(టొరంటో), మన్‌ప్రీత్ సింగ్(బ్రాంప్టన్), ఫిలిప్ టెప్ (హామిల్టన్), అరవింద్ పవార్ (బ్రాంప్టన్), కమర్జిత్ సింగ్ (కాలెడాన్) గుర్జీత్ సింగ్ (కాలెడాన్), సత్రజ్ సింగ్ (కేంబ్రిడ్జ్), శివ్ ఓంకార్ సింగ్ (జార్జిటౌన్), హావో టామీ హుయన ఉన్నారు. గతేడాది డిసెంబర్‌లో అమెరికాలోని ఇల్లినాయిస్‌లో భారతీయ మూలాలున్న ఇద్దరు కెనడా వాసులను అరెస్టు చేశారు. వీరి వద్ద 1,000 పౌండ్ల కొకైన్ బయటపడింది. దీనిని వారు వోల్వో ట్రక్కులో లోడ్ చేసి తరలిస్తుండగా స్వాధీనం చేసుకొన్నారు. ఇక తాజాగా దాడికి సంబంధించిన దర్యాప్తు 2024 జూన్‌లోనే మొదలైంది. అమెరికా-కెనడా మధ్య వాణిజ్య ట్రక్కులు ప్రయాణించే మార్గాలపై నిఘా ఉంచారు. నవంబర్ నాటికి చాలామంది వ్యక్తులు, ట్రెక్కింగ్ కంపెనీ, డ్రగ్స్‌ను దాచే ప్రదేశాలను గుర్తించారు. ఇందుకో కెనడా బోర్డర్ సర్వీస్ ఏజెన్సీ, అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ సాయం తీసుకొన్నారు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి-మే మధ్యలో 127 కేజీల కొకైన్ను విండ్సర్లోని అంబాసిడర్ వంతెన వద్ద, 50 కేజీల కొకైన్ను పాయింట్ ఎడ్వర్డ్‌లోని బ్లూవాటర్ వంతెన సమీపంలో పీల్ పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు.

# హసీనా నోరు మూయించాలని చూస్తే మోదీ అంగీకరించలేదు: యూనస్

**లండన్, జూన్ 12 :** బంగ్లాదేశ్ ప్రభుత్వంపై షేక్ హసీనా విమర్శలు చేయకుండా చూడాలని భారత ప్రధాని మోదీని తాను కోరినట్లు ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్ తెలిపారు.

విద్యార్థుల ఉద్యమంతో పదవి కోల్పోయిన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ఢిల్లీ నుంచే సామాజిక మాధ్యమాల వేదికగా బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వంపై ఆమె విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విషయమై తాను భారత ప్రధాని నరేంద్రమోడీతో చర్చించానని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ తెలిపారు. హసీనాను కట్టడి చేయాలని కోరగా.. దానికి మోడీ అంగీకరించలేదని వెల్లడించారు. లండన్‌లోని చాతమ్ హౌస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ యూనస్ ఈ వ్యాఖ్యలు చేశారు.

కొన్ని నెలల క్రితం బిమ్‌స్టెక్ సదస్సులో భాగంగా మోడీతో భేటీ అయిన యూనస్.. భారత



ప్రధానితో నాటి సంభాషణను గుర్తుచేసుకున్నారు. ''హసీనాకు భారత్‌లో ఆశ్రయం కల్పించడంపై నేను మాట్లాడను. అది మీ విధానపరమైన నిర్ణయం. కానీ బంగ్లాదేశ్ ప్రజలను రెచ్చగొట్టేలా ఆమె ఆన్‌లైన్‌లో ప్రసంగాలు చేస్తున్నారు. దాని వల్ల మా దేశంలో ప్రజలు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. ఈ విషయంలో మీరు జోక్యం చేసుకోండి. అలాంటి ప్రకటనలు, ప్రసంగాలు చేయకుండా ఆమెను అడ్డుకోండి'' అని మోడీని కోరినట్లు యూనస్ తెలిపారు. దీనికి మోడీ బదులిస్తూ.. ''అది సోషల్ మీడియా. దాన్ని నియంత్రించడం సాధ్యం కాదు'' అని చెప్పినట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వాధినేత వెల్లడించారు. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాల గురించి ఆయన మాట్లాడారు. ''ఇది మా పొరుగుదేశం. భారత్‌తో బలమైన సంబంధాలు ఉండాలని మేం కోరుకుంటున్నాం. వారితో మాకు ఎలాంటి సమస్యా లేదు. కానీ, నకిలీ వార్తల కారణంగా మా ప్రయత్నాలకు ఎక్కడో గండి పడుతోందని అనుమానంగా ఉంది'' అని యూనస్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది తొలి అర్ధభాగంలో బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. దీనిపైనా యూనస్ స్పందించారు. కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో భాగం కావాలనే ఉద్దేశం గానీ, ఆసక్తి గానీ తనకు లేవన్నారు. ఎన్నికలు సక్రమంగా జరగాలనే తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ పురోగతికి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

## భారత్‌తో సంబంధాల బలోపేతానికి ఇదో అవకాశం

- కెనడా ప్రధాని మార్క్ కార్నే

**టొరంటో,జూన్ 12 :** అంతర్జాతీయ వాణిజ్యరంగంలో వైవిధ్యంగా ముందుకువెళ్తున్న భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని కెనడా ప్రభుత్వం స్పష్టం చేసింది. వివిధ సుంకాలు విధించి విసిగిస్తున్న అమెరికాతో.. వాణిజ్య సంబంధాలను



తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో.. భారత్‌తో చర్చలు జరపాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. వచ్చేవారం అల్బెర్టా వేదికగా జరగనున్న జీ7 సమావేశాలకు భారత్ ప్రధాని మోడీని ఆహ్వానించడంపై అక్కడి ప్రతిపక్షాలు విమర్శిస్తున్న నేపథ్యంలో కెనడా ప్రభుత్వం ఈమేరకు స్పందించింది. ఆర్థిక ప్రాధాన్యతలపై చర్చించడానికి జీ7 ముఖ్యమైన వేదిక అని కెనడా అంతర్జాతీయ వాణిజ్యశాఖ మంత్రి మనీందర్ సంధూ వ్యాఖ్యానించారు. '' కెనడా ఆర్థిక ప్రాధాన్యతలపై చర్చించేందుకు జీ7 ఓ ముఖ్యమైన వేదిక. పరస్పర ఆర్థిక సహకారం, జాతి భద్రతకు సంబంధించిన అంశాల గురించి విపులంగా చర్చించేందుకు అవకాశం ఉంటుంది. కొంతమంది నాయకులను ఆహ్వానించడంపై స్థానిక నేతల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ, ఈ ఆర్థిక సంక్షోభ సమయంలో పరస్పరం సహకరించుకోవాలి. మన సమస్యలు కొన్నింటిని పరిష్కరించుకోగలగాలి. విమర్శలకు పదునుపెడుతున్న నాయకులు ఈ విషయాన్ని గుర్తిస్తారని భావిస్తున్నాను'' అని మనీందర్ మీడియాకు తెలిపారు. జీ7 సదస్సులో ప్రధానంగా జాతి భద్రత, విదేశీ జోక్యం అంశాలపై చర్చించబోతున్నట్లు ప్రధాని మార్క్ కార్నీ ఇప్పటికే స్పష్టం చేశారన్న ఆయన.. పరస్పర ఆర్థిక సహకారంపైనా సదస్సులో చర్చించబోతున్నట్లు తెలిపారు. మరోవైపు కెనడా గడ్డపై హింసకు తావులేదని మనీందర్ పునరుద్ఘాటించారు. భారత్‌తో దౌత్య సంబంధాలను బలోపేతం చేసుకోవాలన్నా, ముఖాముఖి మాట్లాడాలన్నా జీ7 సదస్సు ఓ చక్కని వేదికని పేర్కొన్నారు.

## కుప్పకూలనున్న నెతన్యాహు సర్కారు?

**జెరూసలెం, జూన్ 12 :** ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రమాదంలో పడింది. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని సర్కారు కుప్పకూలేలా ఉంది. పార్లమెంటు (నెసెట్)ను రద్దు చేయాలంటూ విపక్షాలు ఒక బిల్లు ప్రవేశపెట్టాయి. దీనికి మద్దతు ఇస్తామని కూటమిలోని భాగస్వామ్యపక్షాలు చెబుతున్నాయి. దీంతో ముందస్తు ఎన్నికలు వచ్చేలా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. తప్పనిసరిగా సైన్యంలో సేవలందించాలన్న నిబంధన నుంచి తమను మినహాయించాలని కొన్ని వర్గాలు కోరుతున్నాయి. ఆ చట్టం ఆమోదం పొందకపోవడం ఆ వర్గాల ఆగ్రహాని కి కారణమైంది. విపక్షాలు గానీ చివరిక్షణంలో రాజీకి రాకపోతే బుధవారం రాత్రి ఓటింగు జరిగే అవకాశం ఉంది. ఒకవేళ బిల్లు ఆమోదం పొందినా కొత్తగా ఎన్నికలు జరపడానికి కొన్ని వారాలు పడుతుంది. బిల్లు వీగిపోతే మళ్లీ అలాంటిది ప్రవేశపెట్టడానికి కనీసం ఆరు నెలలు నిరీక్షించాల్సిందే.

## ఆమర్నాథ్ యాత్రకు కనిపించని 'ఉగ్ర'భయం..

**శ్రీనగర్, జూన్ 12 :** పహల్గాం ఉగ్రదాడి తర్వాత జమ్ముకశ్మీర్లో పర్యాటకం ఒక్కసారి స్తంభించిపోయింది. అప్పటికే విహారయాత్రలకు టికెట్లు బుక్ చేసుకున్న వాళ్లు చాలా మంది ప్రయాణాలు రద్దు చేసుకున్నారు. దీని ప్రభావం త్వరలో ప్రారంభం కానున్న ప్రసిద్ధ అమర్నాథ్



యాత్రపైనా పడుతుందని అంతా భావించారు. అయితే, అనుమానాలను పటాపంచలు చేస్తూ.. భారీ సంఖ్యలో యాత్రికులు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. జమ్ముకశ్మీర్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇప్పటివరకు 3.31 లక్షల మంది అమర్నాథ్ యాత్రకోసం పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలుస్తోంది. అమర్నాథ్ గుహకు చేరుకోవాలంటే 45 కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్ చేస్తూ వెళ్లాలి. దీనికి పహల్గాం ఓ బేస్ క్యాంప్గా ఉపయోగపడుతుంది. అక్కడికి చేరుకున్న యాత్రికులు కొద్దిసేపు సేదతీరి మళ్లీ ప్రయాణం ప్రారంభిస్తారు. అదే ప్రాంతంలో ఏప్రిల్ 22న ఉగ్రదాడి జరగడంతో యాత్రికుల సంఖ్య తగ్గుతుందని అధికారులు భావించారు. అయితే, ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు, స్థానికంగా భద్రత పెంపుతో అమర్నాథ్ యాత్రకు పెద్ద సంఖ్యలో స్పందన వస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ ఏడాది జులై 3న అమర్నాథ్ యాత్ర ప్రారంభమై ఆగస్టు 9న ముగుస్తుంది. గతేడాది 52 రోజుల పాటు యాత్ర జరగ్గా.. ఈ సంవత్సరం మాత్రం కేవలం 38 రోజుల్లోనే ముగియనుంది. పహల్గాం, బాల్తాల్ మార్గాల్లో యాత్రికులను అనుమతించనున్నారు. దాదాపు 5 లక్షల మందికిపై భక్తులు ఈ యాత్రలో పాల్గొంటారని శ్రీ అమర్నాథ్ ఆలయ బోర్డు అంచనావేస్తోంది.

# బడిబాట.. నూతన ఒరవడికి శ్రీకారం

- సరికొత్త ప్రచారం దిశగా బడిబాట
- వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- తన సొంత వాహనాన్ని బడిబాట విద్యా వాహిని ప్రచార రథంగా మార్చిన వైనం

**గంగాధర, జూన్ 12, ( మనం న్యూస్) :** ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పిల్లలు ప్రభుత్వ స్కూళ్లలో చదివితే వచ్చే విద్యా, ఆపై అవకాశాలపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించుతున్నారు. పాఠశాలలు గురువారం పున:ప్రారంభమయ్యాయి. బడిబాట కార్యక్రమంలో భాగంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. తన సొంత వాహనాన్ని బడిబాట విద్యా వాహిని వాహనంగా మార్చాలని నిర్ణయించారు. తన ఆలోచనను ఆచరణలోకి తీసుకువచ్చి తన సొంత వాహనాన్ని విద్యా వాహిని వాహనంగా మార్చి బడిబాట ప్రచార కార్యక్రమంలో ఉపయోగించేలా చేశారు. గురువారం గంగాధర మండలం మల్లాపూర్ లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో వాహనాన్ని విద్యాశాఖ అధికారులకు అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ఎవ్వరు చేయని విధంగా ఆలోచన చేసే, తన సొంత వాహనాన్ని విద్యా వాహినికి అందజేసి తన గొప్పదనాన్ని చాటుకున్నారు. వినూత్న ఆలోచన చేసి తన సొంత వాహనాన్ని బడిబాటలో విద్యా వాహిని వాహనంగా వినియోగించడానికి అప్పగించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను నియోజకవర్గ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ప్రశంసలు వెల్లువెత్తాయి.



**ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య : చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందుతుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గతంలో ప్రభుత్వం పాఠశాలలను నిర్వీర్యం చేసి, ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులను మళ్లించే విధంగా కుట్రలు జరిగాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం లో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్టు, పాఠశాలల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి పేద మధ్యతరగతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడం పనిచేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్ రావు, స్కూల్ హెచ్ఎం అంజిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, నాయకులు దుబ్బాసి బుచ్చన్న, పడితపల్లి కిషన్, కోల ప్రభాకర్, కొలిపాక స్వామి, సీనియర్ నాయకులు సత్తు కనకయ్య, గంగాధర సుదర్శన్, గునుకొండ బాబు, వేముల అంజి, కంకణాల రాజగోపాల్ రెడ్డి, గుజ్జుల బాపురెడ్డి, కర్ర బాపురెడ్డి, గరిగంటి కరుణాకర్, మంత్రి మహేందర్, పెంచాల చందు, పానుగంటి సత్యం, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విమాన ప్రమాద సంఘటన కలిచివేసింది

- బీసీ సంక్షేమ అలాగే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



**చిగురు మామిడి జూన్ 12 (మనం న్యూస్) :** అహ్మదాబాద్ లో జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అహ్మదాబాద్ విమానాశ్రయం నుండి లండన్లోని గాట్విక్కు వెళ్తున్న ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్లైనర్ విమానం ఎఐ-171 టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయిందని మీడియా ద్వారా ఈ సమాచారం తెలుసుకొని ఎంతో బాధగా అనిపించిందని తెలిపారు. ఈ ఘటనలో సిబ్బందితో సహా 242 మందితో ప్రయాణిస్తున్న ఈ విమానం విమానాశ్రయ సమీపంలో ఉన్న డాక్టర్ల హాస్టల్లోకి దూసుకెళ్లి కూలిపోయిందనీ బిల్డింగ్ లో ఉన్న డాక్టర్లు కూడా చనిపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ ప్యాసింజర్ విమానం భారత్ లోని అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయిందనీ సాంకేతిక కారణాలవల్ల ఈ సంఘటన జరిగి ఉండవచ్చని ఏది ఏమైనప్పటికీ ఇంత పెద్ద ఘటన జరగడం భారతదేశాన్ని కాకుండా యావత్తు ప్రపంచాన్ని విషాదంలో ముంచిందని పేర్కొన్నారు. భారత ప్రయాణికులతో పాటు వివిధ దేశాలకు చెందిన ప్రయాణికులు ఈ దుర్ఘటనలు మృత్యువుపాలు కావడం ప్రజలు అందరినీ కంటతడి పెట్టిస్తుందని పేర్కొన్నారు. ఈ విమాన ప్రమాద ఘటనపై తాను ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. చనిపోయిన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని అదేవిధంగా మృతి చెందిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విమాన ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

# ఈ నెల 14న ది ఓబీసీ అప్రైజింగ్ పుస్తకావిష్కరణ




**నిజామాబాద్ బ్యూరో, జూన్ 12 ( మనం న్యూస్) :** 'ఓబీసీల పోరుబాట' పుస్తకావిష్కరణను ఈనెల 14న నిర్వహిస్తున్నట్లు పద్మశాలి సంఘం సభ్యులు తెలిపారు. నగరంలోని ప్రెస్క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రముఖ ఐఏఎస్ అధికారి, మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి, హైకోర్టు న్యాయవాది పృథ్వీరాజ్ సింగ్ సంయుక్తంగా ఈ పుస్తకాన్ని రచించారని పేర్కొన్నారు. ఆరేళ్లపాటు సాగిన లోతైన పరిశోధన ఆరు రాష్ట్రాల్లో జరిపిన విస్తృత అధ్యయనం, నిశిత విశ్లేషణల ఫలితమే ఈ 'ది ఓబీసీ అప్రైజింగ్' పుస్తకం అన్నారు. సమావేశంలో నగర పద్మశాలి సంఘం అధ్యక్షుడు పెంట దత్తాద్రి, కార్యదర్శి చౌటు భూమేశ్వర్, కోశాధికారి మోర సాయిలు, ఉపాధ్యక్షులు ఏనగందుల మురళి, దుబ్బ రాజాం, బాగుల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు అవధూత రాములు, ఎనుగందుల సుభాష్, బూస రవి, భూష శ్రీనివాస్, కస్తూరి గంగారాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సి.నారాయణ రెడ్డి కి ఘన నివాళులు అర్పించిన తెరవే



**కామారెడ్డి టౌన్, జూన్ 12 (మనం న్యూస్) :** సాహితీ శిఖరం డాక్టర్ సి నారాయణ రెడ్డి అని, సాహితీ ప్రక్రియల్లో తన ప్రతిభను చాటిన మహాకవి అని తెరవే జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ అన్నారు. గురువారం కామారెడ్డిలోని కర్షక్ బీఈడీ కళాశాలలో డాక్టర్ సి నారాయణ రెడ్డి వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ., విశ్వంభర కావ్యానికి జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకొని, తెలంగాణ ప్రాంత ప్రతిభను ప్రపంచానికి చాటిన గొప్ప సాహితీవేత్త సినారె అని, ఎంతోమంది కవులకు తన సాహిత్యాన్ని ఆదర్శంగా నిలిపారని, సాహిత్యంలోనే కాకుండా సినీ ప్రపంచంలో కూడా తన అక్షరాల జెండాను ఎగరవేసి గజల్ రంగంలో రారాజుగా నిలిచి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గొప్ప సాహితీవేత్త గా తెలంగాణ వైభవాన్ని ప్రతిభను తెలిపిన గొప్ప కవిగా నిలిచారని అన్నారు. ఎన్నో పదవులను అలంకరించి ఆ పదవులకు గొప్పతనాన్ని తీసుకువచ్చిన ప్రతిభ డాక్టర్ సి.నారాయణరెడ్డిది అని అన్నారు. ఈ నివాళి కార్యక్రమంలో తెరవే జిల్లా ప్రతినిధులు కాశ నరసయ్య, ఎంబారి లింగం, చంద్రకాంత్, కొడి రవీందర్, నాగభూషణం, బాల రాజయ్య, డిటిఎఫ్ విజయరామరాజు, కిషన్ తదితరులు పాల్గొని సినారె రాసిన సినీ గేయాలను కవితలను పాడి వినిపించారు.

# గుర్తింపు సంఘం ప్రతినిధులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం

**రామగిరి, జూన్ 12 (మనం న్యూస్) :** రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో గుర్తింపు సంఘం అయినటువంటి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులతో గురువారం జి.యం. కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు తో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎం.రామచంద్రారెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో భాగంగా సెక్యూరిటీ చెక్ పోస్ట్ లలో తలుపు, కిటికీలు లేని చోట నూతన చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయడం, సెక్యూరిటీ, సివిల్ విభాగాలలో ఆర్.ఓ. ప్లాంట్ ఏర్పాటు చేయడం, ఏరియాలోని సెక్యూరిటీ చెక్ పోస్ట్ లలో ఎ.సి.లను అమర్చడం, ఓసిపి-1, ఓసిపి-2 ఉపరితల గనులలో స్క్రాప్ యాడ్ ఏర్పాటు చేయడం, అడ్రియాల లాంగ్ వాల్ గని ఆవరణలో త్రాగు నీటి కోసం బోర్ వేయించడం, సెంటినరీ కాలనీలో పారిశుధ్య పనులు చేయడం, ఓసిపి- 2 లోని ఎస్ అండ్ డి, ఎలక్ట్రికల్ సెక్షన్స్ లో ఆర్.ఓ. ప్లాంట్ ను ఏర్పాటు చేయడం, ఓసిపి-2 బేస్ వర్క్ షాప్,



డంపర్ సెక్షన్ నుండి మిషన్ షాప్ వరకు రూఫ్ రేకులు మార్చడం, ఓసిపి-2 బేస్ వర్క్ షాప్ లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగుల కోసం విశ్రాంతి గది, మరుగుదొడ్లను నిర్మించడం, ఆర్జీ-3, ఎపిఎలోని జనరల్ మేనేజర్ కార్యాలయం, వివిధ ప్రాజెక్ట్ ఆఫీసర్, మేనేజర్ ల కార్యాలయాలను ఆధునీకరించి, నూతన సామాగ్రి ఏర్పాటు చేయడం లాంటి పది అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జి.యం. మాట్లాడుతూ ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అదేవిధంగా కార్పొరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు డి.తిరుపతి రావు, ఇ.గంగాధర్, బి.భాస్కర రాజు, ఏరియా ఇంజనీర్లు వై.వి. శేఖర బాబు, కె.యాదయ్య, ఎస్వోటుజిఎంలు యం.రామ్మోహన్, బి.వి.సత్యానారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, విభాగాధిపతులు కె.చంద్రశేఖర్, కాశీ విశ్వేశ్వర రావు, బి.సుదర్శనం, బి.రాజేంద్రకుమార్, ఉదయభాస్కర్, చంద్రశేఖర్, టి.రఘు రామ్, షబ్బీరుద్దీన్, అధికారులు మతీన్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో మహిళా సాధికారతను బలోపేతానికి కార్యాచరణ

**మంచిర్యాల, జూన్ 12 (మనం న్యూస్) :** సింగరేణిలో మహిళా సాధికారతను బలోపేతం చేయడానికి ఐఎన్టీయూసీ సుదీర్ఘ కార్యాచరణ చేపట్టినట్లు ఐఎన్టీయూసీ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు తెలిపారు . ఐఎన్టీయూసీ యూనియన్ సెక్రటరీ జనరల్ మరియు తెలంగాణ రాష్ట్ర మినిమం వేజస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాలతో, సింగరేణి వ్యాప్తంగా మహిళా ఉద్యోగుల నుంచి స్థానిక ఏరియా కమిటీలను ఏర్పాటు చేసి,వారి అభ్యున్నతికి అవసరమైన దిశగాచర్యలు తీసుకుంటు న్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఐఎన్టీయూసీ మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీమతి శేష రత్నం , ఆర్ జి -1 మహిళా అధ్యక్షురాలు శ్రీమతి దార సుశీల ల నేతృత్వంలో ఏరియా వర్క్ షాప్, డిస్పెన్సరీలు, జీఎం ఆఫీస్ డిపార్ట్మెంట్లలో పర్యటించి మహిళా ఉద్యోగుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. వారి సమస్యలను స్థానిక కమిటీలతో సమన్వయం చేసి, ఏరియా బ్రాంచ్ మరియు కేంద్ర స్థాయి నాయకత్వం ద్వారా బి. జనక్ ప్రసాద్ గారి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామని వారు సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు



తెలిపారు .ఈ సందర్భంగా కొన్ని డిమాండ్ లను యాజమాన్యం దృష్టికి తెచ్చారు.మహిళా ఉద్యోగుల కు తగిన విధంగా సూటబుల్ ప్లేస్మెంట్లు కల్పించాలని, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని, ఉద్యోగ ఒత్తిడి నివారణ చర్యలు చేపట్టాలని, పని ప్రదేశాల్లో మహిళలకు తగిన రెస్ట్ రూమ్ సౌకర్యాలు, ఫీడింగ్ మదర్స్కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ఖాళీగా ఉన్న సర్ఫేస్ జాబ్స్లో మహిళలకు ఇంటర్నల్ పరీక్షల ద్వారా శాశ్వత నియామకాలు ఇవ్వాలని, డిస్పెన్సరీలు , ఏరియా హాస్పిటల్లలో పని చేస్తున్న మహిళా పారా మెడికల్ అసిస్టెంట్స్ను రెగ్యులరైజ్ చేయాలని, జీఎం ఆఫీసులు, ఇతర విభాగాల్లో క్లరికల్ మరియు క్యాటగిరీ పనులు చేస్తున్న మహిళలకు యాక్టింగ్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు . ఈ కార్యక్రమంలో కేంద్ర నాయకులు గరిగస్వామి,కలవేణి శ్యామ్, తిరుపతి రాజు, ఏనుగు రవీందర్ రెడ్డి, చాట్ల అశోక్, ఏరియా నాయకులు బ్రహ్మచారి, ప్రసాద్, వెంకటేశ్వర్లు, ముత్తయ్య, శివ, సురేష్ యాదవ్ ధనలక్ష్మి, వర్క్ షాప్ పిట్ కార్యదర్శి రమేష్, సతీష్, నీలం సదయ్య, తిరుపతి లు పాల్గొన్నారు.

# బీజేపీ పార్టీ ని గ్రామాల్లో బలోపేతం చేయాలి

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



**నిజామాబాద్, జూన్ 12 ( మనం బ్యూరో) :** గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. ఆలూర్ మండల బీజేపీ నూతన ప్రధాన కార్యదర్శిగా అర్హ హరీష్కు గురువారం ఆయన నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు సూర శ్రీకాంత్, తెలంగాణ బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ కొత్తూరు గంగాధర్, ఎస్టీ మోర్చా స్టేట్ సెక్రెటరీ మహేష్ పాల్గొన్నారు.

# ఈ నెల 16వలోగా పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందాలి

- డి.ఇ.ఓ డి.మాధవి

**పెద్దపల్లి, జూన్ 12 (మనం ప్రతినిధి) :** పెద్దపల్లి జిల్లాలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం లోగా పూర్తి స్థాయిలో విద్యార్థులకు ఉచిత పాఠ్య ,నోటు పుస్తకాలను అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి డి.మాధవి తెలిపారు. ఈ మేరకు మండల విద్యాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయుల తగు చర్యలు గైకొనాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.1,72,348 పాఠ్య పుస్తకాలు ఇప్పటికే పాఠశాలలకు చేరుకోగా అందులో ఇప్పటి వరకు



50,668 విద్యార్థులకు పంపిణీ చేసినట్టు, మొత్తం 2,11,491నోట్ బుక్స్ పాఠశాలలకు రాగా అందులో 64,458 నోట్ బుక్స్ ను విద్యార్థులకు అందించినట్లు తెలిపారు.అలాగే మొత్తం 30,687 విద్యార్థులకు ఏక రూప దుస్తులకు గాను 17,866 జతల యునిఫామ్స్ పాఠశాలలకు చేరగా అందులో నుండి 10,281జతల దుస్తులను విద్యార్థులకు అందించినట్లు వివరించారు. పాఠశాలలు ప్రారంభమైన దృష్ట్యా త్వరితగతిన పంపిణీ కార్యక్రమంను పూర్తి గావించాలన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన గ్రాండ్ పేరెంట్ టీచర్స్ పత్తిపాక ఉన్నత పాఠశాల, పెద్దపల్లి బాలుర ఉన్నత పాఠశాలల సమావేశాలకు డి.ఇ.ఓ హాజరైనారు.అలాగే శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని పాఠశాలను ఆమె సందర్శించినారు. గురువారం నాటికి 1924 ప్రవేశాలు జిల్లా వ్యాప్తంగా 1, 6వ తరగతుల్లో నమోదు అయినట్టు తెలిపారు.

# సింగరేణిలో నేచురల్ గ్యాస్ వినియోగం జీఎం

**నస్పూర్, జూన్ 12(మనం న్యూస్) :** పర్యావరణ రైతు దిశగా ముందడుగు సింగరేణిలో నాచురల్ గ్యాస్ వినియోగించనున్నట్లు జీఎం శ్రీనివాస్ తెలిపారు.గురువారం కార్పొరేట్ జనరల్ మేనేజర్ (ఈ అండ్ ఎం) ఓసిపిలు డివిఎస్ఎస్ఎన్ రాజు, సింగరేణి సంస్థలో న్యాచురల్ గ్యాస్ వినియోగంపై పరిశీలన కమిటీ డైరెక్టర్ మేజర్ శంకర్ కరాజాగీ తో కలిసి శ్రీరాంపూర్ ఉపరితల గనిలో నాచురల్ గ్యాస్ వినియోగం పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో డీజిల్, పెట్రోల్ వంటి పారంపర్య ఇందనాల వినియోగాన్ని తగ్గించి, పర్యావరణానికి మిత్రమైన నేచురల్ గ్యాస్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు చురుకుగా చర్యలు చేపడుతోందని తెలిపారు. పర్యావరణ హిత దిశగా సింగరేణి అన్ని ఏర్పాట్లు చేస్తుందని, నాచురల్ గ్యాస్ వాడడం వలన పర్యావరణాన్ని పరిరక్షించిన వారిమి అవుతామని, సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ఈ న్యాచురల్ గ్యాస్ వంట చేయడానికి, గృహ అవసరాలకు ఉపయోగపడుతుందని,



ముఖ్యంగా భారీ యంత్రాలలో డీజిల్ బదులు నాచురల్ గ్యాస్ సంబంధిత పరికరాలను పెట్టి నేచురల్ గ్యాస్ ద్వారా వాహనాలు నడపడానికి సాధ్యాసాధ్యాలను ఈ కమిటీ వారు కుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా మహారాష్ట్రకు చెందిన మహారాష్ట్ర నాచురల్ గ్యాస్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించడం అభినందించదగిన విషయమని తెలిపారు. కార్పొరేట్ జీఎం డివిఎస్ఎస్ఎన్ రాజు మాట్లాడుతూ నేచురల్ గ్యాస్ వాడకం సాధ్యసాధ్యాలపై ఈ బృందం సమగ్రంగా అధ్యయనం చేస్తోందని, ఈ విధానం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు, సంస్థకు ఆర్థికంగా కూడా మేలైన ఫలితాలు సాదించగలమన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, గని మేనేజర్ ఐ శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, గని రక్షణాధికారి శ్రీదర్, కమిటీ ప్రతినిధులు ఎస్.కె సింగ్, సుజిత్ రాయికర్, అమోల్ హట్టి పాల్గొన్నారు.

# ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన జి.యం

**రామగిరి, జూన్ 12 (మనం న్యూస్) :** రామగుండం-3 ఏరియా జి.యం.కార్యాలయంలో ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధులు, రామగుండం-1,2,3 ఏరియా ఇంజనీర్లు, మూడు ఏరియాలలోని వివిధ గనుల ప్రాజెక్ట్ ఇంజనీర్లతో కార్పొరేట్ ఉపరితల గనుల విభాగం జనరల్ మేనేజర్ డి.వి.సూర్యనారాయణరాజు, ఏరియా జి.యం. కొలిపాక నాగేశ్వర రావుతో కలిసి కాస్ట్ క్యాప్, డిపో అగ్రిమెంట్లు, భారీ యంత్రాల పని తీరు, యంత్రాల విడిభాగాలు, మరమ్మతులు లాంటి అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఆటంకం కలుగకుండా భారీ



యంత్రాలను అందుబాటులో ఉంచాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని, విడి భాగాలను అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. భారీ యంత్రాల నిర్వహణకు, మరమ్మతులకు సంబంధించి ఎల్ అండ్ టి కంపెనీ సర్వీస్ ఇంజనీర్లు సకాలంలో స్పందించే విధంగా చూడాలని ఆ కంపెనీ ప్రతినిధులను కోరారు. ఈ సమావేశంలో ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధులు బాలభాస్కర్, రవిచంద్రన్, ఆర్జీ-1,2,3 ఏరియా ఇంజనీర్లు డి.వి.రావు, ఎం.నర్సింహారావు, వై.విజయశేఖరబాబు, వివిధ గనుల ప్రాజెక్టు ఇంజనీర్లు, ఇతర అధికారులు హాజరయ్యారు.

## భారత పర్యటనకు న్యూజిలాండ్ క్రికెట్ జట్టు?



**స్పోర్ట్స్ డెస్క్ (మనం న్యూస్):** న్యూజిలాండ్ పురుషుల క్రికెట్ జట్టు వచ్చే ఏడాది జనవరిలో భారత పర్యటనకు రానున్నట్లు తెలుస్తోంది. టీ20 ప్రపంచ కప్-2026 సన్నహకాల్లో భాగంగా ఈ టూర్‌ను కివీస్ క్రికెట్ బోర్డు ప్లాన్ చేసినట్లు పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి. టైమ్స్ ఇండియా రిపోర్ట్ ప్రకారం.., ఈ పర్యటనలో భాగంగా న్యూజిలాండ్ జట్టు ఆతిథ్య టీమిండియాతో మూడు వన్డేలు, ఐదు టీ-20లు ఆడనున్నట్లు సమాచారం.

**ఈ ఏడాది ఆఖరిలో..**

ఈ ఏడాది ఆఖరిలో కివీస్ తమ స్వదేశంలో విండీస్‌తో ఆల్ ఫార్మాట్ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ ముగిసిన వెంటనే బ్లాక్ క్యాప్స్ జట్టు భారత్‌కు వచ్చే అవకాశముంది. కాగా, టీ20 ప్రపంచ కప్ - 2026కు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ టోర్నీ సన్నాహాల్లో భాగంగా సూర్య కుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు సైతం ఈ ఏడాది ఆఖరిలో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాతో టీ-20 సిరీస్‌లు ఆడనుంది.

**న్యూజిలాండ్ చివరగా...**

న్యూజిలాండ్ చివరగా వైట్‌బాల్ సిరీస్‌లు ఆడేందుకు 2023లో భారత్ పర్యటనకు వచ్చింది. ఆ సమయంలో బ్లాక్ క్యాప్స్ టీమ్ మూడు వన్డేల సిరీస్‌లో వైట్ వాష్ కాగా.., టీ-20 సిరీస్‌ను 2-1 తేడాతో భారత్ కోల్పోయింది.

**ప్రతికారం తీర్చుకుంది....**

ఆ తర్వాత ఏడాది మాత్రం టీమిండియా జరిగిన రెడ్‌బాల్ సిరీస్‌లో మాత్రం న్యూజిలాండ్ ప్రతీకారం తీర్చుకుంది. మూడు టెస్టుల సిరీస్‌లో 3-0 తేడాతో టీమిండియాను కివీస్ చిత్తు చేసింది. అయితే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఫైనల్లో మాత్రం న్యూజిలాండ్‌ను భారత్ మట్టికరిపించింది.

## సత్తా చాటడానికి ఇదే సరైన సమయం



- **టీమ్ ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్**



**స్పోర్ట్స్ డెస్క్:** టీమ్ ఇండియా, ఇంగ్లండ్ క్రికెట్ జట్ల మధ్య జూన్ 20 నుంచి ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ జరగనుంది. భారత జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా, రిషభ్ పంత్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ రిటైర్మెంట్లతో సీనియర్లు లేకుండానే గిల్ సేన ఇంగ్లండ్‌తో తలపడబోతోంది.

ఈ నేపథ్యంలో ఏదైనా ప్రత్యేకంగా చేసి తమను తాము నిరూపించుకోవడానికి యువ ఆటగాళ్లకు ఇదే సరైన సమయం అని టీమ్ ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నారు.

**దిగ్గజ ఆటగాళ్లు లేకుండా.. బరిలోకి...**

'ప్రస్తుతం మనం ఉన్న స్థితిని రెండు కోణాల్లో చూడొచ్చు. మొదటిది.. మనం ముగ్గురు అత్యంత అనుభవజ్ఞులైన ఆటగాళ్లు (రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్) లేకుండా బరిలోకి దిగుతున్నాం. రెండో కోణం.. దేశం కోసం ప్రత్యేకంగా ఏదైనా చేయడానికి మన చేతుల్లో అద్భుతమైన అవకాశం ఉంది. ఈ బృందంలో.. ఆకాంక్ష, అభిరుచి, ప్రత్యేకంగా ఏదైనా చేయాలనే నిబద్ధత ఉందని తాను భావిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. మనం త్యాగాలు చేస్తే.. మనం కంఫర్ట్ జోన్ల నుంచి బయటకు వస్తే.. మనం పోరాడటం ప్రారంభిస్తే.. ప్రతి సెషన్, ప్రతి గంట, ప్రతి బంతినీ మనం చిరస్మరణీయంగా మలుచుకోగలం. దాన్ని ఈరోజు నుంచే ప్రారంభించండి. దేశం కోసం ఆడటం కంటే పెద్ద గౌరవం మరొకటి లేదు' అని గంభీర్ భారత జట్టుతో అన్నారు.

**ఒకరి అనంతరం మరొకరు..**

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇంగ్లండ్ టూర్‌కు ముందు ఐపీఎల్ మధ్యలో టెస్ట్ ఫార్మాట్‌కు తమ రిటైర్మెంట్లను కొద్ది రోజుల వ్యవధిలో ఒకరి తర్వాత మరొకరు ప్రకటించారు. అంతకు ముందు ఆస్ట్రేలియా టూర్ మధ్యలో రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు

## ఇంగ్లండ్‌తో తొలి టెస్టు! జడేజాకు నో ఛాన్స్?



**స్పోర్ట్స్ డెస్క్:** భారత్ - ఇంగ్లాండ్ దేశాల మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆరంభానికి కేవలం వారం రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు లీడ్స్ వేదికగా జూన్ 20 నుంచి 24 వరకు జరగనుంది. ఇప్పటికే ఇంగ్లాండ్ గడ్డపై అడుగుపెట్టిన భారత జట్టు నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తోంది.

ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి సిరీస్‌లో శుభారంభం చేయాలని శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా భావిస్తోంది. ఈ నేపథ్యంలో తొలి టెస్టు కోసం టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్‌ను భారత మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ ఎంచుకున్నాడు. బంగర్ తన ఎంపిక చేసిన తుది జట్టులో ఓపెనర్లగా యశస్వి జైశ్వాల్, కేఎల్ రాహుల్‌కు అవకాశమిచ్చాడు.

**రాహుల్ సరైనోడు..**

రోహిత్ శర్మ స్థానంలో ఓపెనర్‌గా రాహుల్ సరైనోడని స్టార్ స్పోర్ట్స్ చర్చా కార్యక్రమంలో బంగర్ అభిప్రాయపడ్డాడు. అదేవిధంగా ఫస్ట్ డౌన్‌లో అన్‌క్యాప్డ్ ప్లేయర్ అభిమన్యు ఈశ్వరన్‌కు అతడు ఛాన్స్ ఇచ్చాడు. ఇక నాలుగో స్థానంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్‌కు రావాలని సంజయ్ సూచించాడు.

**ఐదో స్థానంలో... కరుణ్**

ఇక ఎనిమిదేళ్ల తర్వాత రీఎంట్రీ ఇచ్చిన కరుణ్ నాయర్‌కు ఐదో స్థానంలో ఈ భారత మాజీ క్రికెటర్ చోటు ఇచ్చాడు. ఈ జట్టులో వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్, ఆల్‌రౌండర్ కోటాలో నితీష్ కుమార్ రెడ్డిలకు స్థానం దక్కింది. స్పెషలిస్టు స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్.. ఫాస్ట్ బౌలర్ల కోటాలో జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్‌ను బంగర్ ఎంపిక చేశాడు.

**జడేజాకు చోటు..!**

అయితే ఈ మాజీ బ్యాటింగ్ కోచ్ ఎంపిక చేసిన జట్టులో స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు చోటు దక్కకపోవడం గమనార్హం. జడేజాతో పాటు యువ సంచలనం సాయి సుదర్శన్‌ను కూడా అతడు పరిగణనలోకి తీసుకోలేదు.

**తొలి టెస్టుకు బంగర్ భారత జట్టు**

యశస్వి జైశ్వాల్, కేఎల్ రాహుల్, అభిమన్యు ఈశ్వరన్, శుబ్‌మన్ గిల్(కెప్టెన్), కరుణ్ నాయర్, రిషబ్ పంత్, నితీష్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్

## మసూరీలో చిరు సందడి



**సినిమా డెస్క్:** అగ్ర నటుడు చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా వడివడిగా ముందుకు సాగుతోంది. బుధవారం మసూరీలో రెండో షెడ్యూల్ చిత్రీకరణ మొదలైంది.

అగ్ర నటుడు చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా వడివడిగా ముందుకు సాగుతోంది. బుధవారం మసూరీలో రెండో షెడ్యూల్ చిత్రీకరణ మొదలైంది. అందమైన హిల్ స్టేషన్‌లో చిరంజీవి, నయనతారతోపాటు ఇతర ప్రధాన తారాగణంపై పది రోజులపాటు కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. చిరంజీవి 157వ సినిమా ఇది. ఆయన సరసన నయనతార కథానాయికగా నటిస్తున్నారు. 'సైరా నరసింహారెడ్డి', 'గాడ్‌ఫాదర్' తర్వాత ఈ కలయికలో రూపొందుతున్న మూడో చిత్రమిది. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

''90వ దశకంలో చిరంజీవిని, అప్పటి ఆయన కామెడీ టైమింగ్‌ని గుర్తు చేస్తూ రూపొందిస్తున్న చిత్రమిది. అభిమానులకు ఈ సినిమా మరింత ఆనందం పంచుతుంది. ప్రస్తుతం వినోదాత్మక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నామ''ని సినీ వర్గాలు తెలిపాయి. వచ్చే సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: సమీర్‌రెడ్డి, ప్రొడక్షన్ డిజైన్: ఎ.ఎస్.ప్రకాశ్, కూర్పు: తమ్మిరాజు.

## గద్దర్ పురస్కారాలు.. ఉత్తమ చిత్రానికి 4 అవార్డులు: దిల్ రాజు



**సినిమా డెస్క్:** తెలంగాణ ప్రభుత్వం అందించనున్న గద్దర్ పురస్కారాలపై ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు ప్రెస్‌మీట్ నిర్వహించారు. అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న విమాన ప్రమాదం నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు హాజరు కాలేకపోయారని తెలిపారు. ఆ విషాదరకర ఘటనపై మౌనం పాటిస్తూ సంతాపం తెలిపారు. అనంతరం, అవార్డుల వివరాలు వెల్లడించారు

''14 ఏళ్ల తర్వాత జరగనున్న అవార్డుల వేడుకను విజయవంతం చేయాల్సిన బాధ్యత ఎఫ్‌డీసీతో పాటు ఇండస్ట్రీకీ ఉంది. ఈ నెల 14న సాయంత్రం 6 గంటలకు వేడుక ప్రారంభమవుతుంది. ఆ ఈవెంట్ 'ఐ అండ్ పీఆర్' ద్వారా ప్రత్యక్ష ప్రసారం కానుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు సినీ అభిమానులకు చేరువవ్వాలని కోరుకుంటున్నాం. 2014 నుంచి 2023 వరకు.. బెస్ట్ ఫిల్మ్ (ఏడాదికి మూడు చొప్పున)కు సంబంధించిన హీరో, హీరోయిన్, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌లు అవార్డులు అందుకుంటారు. ఉత్తమ చిత్రాలకుగానూ ఇలా నలుగురికి పురస్కారాలు ఇవ్వనుండడం తొలిసారి. అందరూ హాజరై, విజయవంతం చేయాలని కోరుతున్నా'' అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా ఈ అవార్డుల కార్యక్రమం జరగనుంది.





## కొన్నిసందర్భాలలో రిస్క్ తప్పదు

- **ప్రమాదంపై నిఖిల్ స్పందన**

**సినిమా డెస్క్:** హీరో నిఖిల్ సినిమా షూటింగ్‌లో ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఆయన ఒక పోస్ట్ చేశారు. రామ్‌చరణ్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, వి మెగా పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా 'ది ఇండియా హౌస్' చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

అయితే, సినిమాలో అత్యంత కీలకమైన సీన్ చిత్రీకరణ కోసం శంషాబాద్ సమీపంలో ఒక భారీ సెట్ వేశారు. సముద్రం సీన్స్ తీసేందుకు అతి పెద్ద వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయగా ప్రమాదవశాత్తు అది పగిలిపోయింది. దీంతో ఒక్కసారిగా సెట్‌లోకి నీళ్లు ముంచెత్తాయి. ఈ ఘటన వల్ల చాలామంది గాయపడ్డారని తెలిసింది. అయితే, తాజాగా ఈ చిత్ర హీరో నిఖిల్ వివరణ ఇచ్చారు.

**ప్రమాదంపై ఇలా..**

ప్రమాదంపై నిఖిల్ ఇలా స్పందించారు. 'మేము అందరం చాలా క్షేమంగానే ఉన్నాం. ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ అనుభూతిని ఇవ్వాలని ప్రయత్నాలు చేసే క్రమంలో కొన్నిసార్లు ఇలాంటి రిస్కులు తీసుకోవాల్సిందే. అలాంటి సమయంలో ఒక్కోసారి ఇలాంటి ఘటనలు జరగొచ్చు.

**సురక్షితంగా బయటపడ్డాం**

మా చిత్ర యూనిట్ ముందుగా తీసుకున్న జాగ్రత్తల వల్ల మేము పెద్ద ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాం. అయితే, మేము అత్యంత ఖరీదైన సినిమా పరికరాలను కోల్పోయాం. దేవుడి దయ వల్ల ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.' అని ఆయన తెలిపారు. పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నిఖిల్, సయి మంజ్రేకర్ జంటగా నటిస్తున్నారు. రామ్ వంశీకృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీలో అనుపమ్ ఖేర్ ఒక కీలకమైన పాత్రలో నటిస్తున్నారు.

## సీనియర్ నిర్మాత కె.మహేంద్ర కన్నుమూత



**సినిమా డెస్క్:** సీనియర్ నిర్మాత కావూరి.మహేంద్ర అనారోగ్యం బారినపడి తుదిశ్వాస విడిచారు. సీనియర్ నిర్మాత, ఏఏ ఆర్ట్స్ అధినేత కావూరి మహేంద్ర(79) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోన్న ఆయన గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు తుది శ్వాస విడిచారు. గురువారం మధ్యాహ్నం గుంటూరులో మహేంద్ర అంత్యక్రియలు జరగనున్నట్టు సమాచారం. 1946లో జన్మించిన మహేంద్ర ప్రొడక్షన్ కంట్రోలర్‌గా పలు చిత్రాలకు సేవలు అందించారు. దర్శకత్వంలో శిక్షణ పొంది నిర్మాతగా మారారు. 50కు పైగా సినిమాలు నిర్మించారు. గీతా ఆర్ట్స్ పిక్చర్స్, ఏఏ ఆర్ట్స్ బ్యానర్‌పై చిత్రాలు నిర్మించారు. సినీ పరిశ్రమ హైదరాబాద్ వచ్చాక ఏఏ ఆర్ట్స్ బ్యానర్‌లో శ్రీహరిని హీరోగా పరిచయం చేశారు. 1977లో 'ప్రేమించి పెళ్ళి చేసుకో'తో నిర్మాతగా మారిన మహేంద్ర 'ఏది పుణ్యం? ఏది పాపం?', 'ఆరని మంటలు', 'తోడు దొంగలు', 'బంది పోటు రుద్రమ్మ', 'ఎదురులేని మొనగాడు', 'ఢాకూరాణి', 'ప్రచండ భైరవి', 'కనకదుర్గ వ్రత మహత్యం' చిత్రాలు నిర్మించారు. నటుడు, నిర్మాత మాదాల రవికి మహేంద్ర మామయ్య అవుతారు. దర్శకుడు గోపీచంద్ మలినేనిని ఇండస్ట్రీకి పరిచయం చేశారు.

## కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'మిత్ర మండలి'



**ప్రియదర్శి, నిహారిక ఎన్ఎమ్ జోడీగా నటిస్తున్న కొత్త చిత్రం 'మిత్ర మండలి'. తాజాగా ఈ మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు. ఈ మూవీని విజయేందర్ దర్శకత్వం వహిస్తున్నార్రు. ఇందులో 'మ్యాడ్' ఫేమ్ విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలో నటిస్తున్నార్రు. ఈ చిత్రాన్ని బన్నీవాసు సమర్పిస్తుండగా కల్యాణ్ మంతిన, భాను ప్రతాప్, విజేందర్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నార్రు. అందర్నీ నవ్వించేలా టీజర్ ఉంది. సోషల్ మీడియా ద్వారా వివిధ భాషల ప్రేక్షకులకు చేరువైన నిహారిక ఎన్ఎమ్.. ఇటీవల 'మిషన్ ఇంపాజిబుల్ - ది ఫైనల్ రెకనింగ్' కోసం టామ్ క్రూజ్‌తో కలిసి పనిచేసి వార్తల్లో నిలిచింది. ఇప్పుడు మిత్రమండలి చిత్రంతో టాలీవుడ్‌లోకి అరంగేట్రం చేస్తోంది. విజయేందర్ ఎస్ నూతన దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. బన్నీవాసు తాను నూతనంగా ప్రారంభించిన బి.వి. వర్క్స్ పతాకంపై 'మిత్ర మండలి' చిత్రాన్నిసమర్పిస్తున్నారు.**




Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP),
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.